STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 112 | ఎడిటర్ : అలీ ముర్తుజా | బుధవారం 04 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |



స్థానిక సమరంలో కూటమి సునామీ!

పుర, నగర పాలక పీఠాలన్నీ ఎన్డీయే పక్షాల కైవసం

"ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల పోరులో అధికార కూటమి సునామీ సృష్టించింది. నగర, పురపాలక అధ్యక్ష స్థానాలకు జరిగిన ఈ ప్రత్యక్ష ఎన్నికల్లో ఓటర్లు తెలుగుదేశం, జనసేన, బీజేపీలకు బ్రహ్మరథం పట్టారు. మొత్తం 92 పీఠాలకు గానూ 91 స్థానాలను ఏకపక్షంగా కైవసం చేసుకుని ఆ పక్షాలు సరికొత్త చరిత్ర లిఖించాయి. విపక్ష వైఎస్సార్సీపీ ఘోర పరాభవంతో కేవలం ఒక్క స్థానానికే పరిమితమైంది.

కేవలం నందికొట్కూరుకే పరిమితమైన వైఎస్సార్సీపీ

- దాదాపు మూడు వేలకు పైగా వార్డుల్లో అధికార కూటమిదే విజయదుందుభి
- మురసు తుఫానుతో ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో లెక్కింపునకు తీవ్ర ఆటంకం

వివరాలు 2లో..

నగర పాలక, పురపాలక, నగరపంచాయతీల్లో పార్టీల వారీగా సాధించిన స్థానాలు

రాజకీయ పార్టీ	మేయర్	చైర్మన్	ఏకగ్రీవాలు	మొత్తం
తెలుగుదేశం	10	65	15	75
జనసేన	2	11	1	13
బీజేపీ	1	2	1	3
వైఎస్సార్సీపీ	0	1	0	1
మొత్తం	13	79	17	92

వార్డుల వారీగా గెలిచిన స్థానాలు:

- తెలుగుదేశం: 1,600 పైచిలుకు
- జనసేన: 260 పైచిలుకు
- వైఎస్సార్సీపీ: 230 సుమారుగా
- బీజేపీ: 90 పైచిలుకు



సుపరిపాలనకే ప్రజల పట్టం

- స్థానిక పోరులో కూటమి ప్రభుత్వానికే మద్దతు
- ప్రజా సమస్యల పరిష్కారానికే నా తొలి ప్రాధాన్యం
- ఉత్తమ రాజకీయాలు, పరిపాలనే మా విధానం
- ఎన్నికల ఫలితాలపై సీఎం చంద్రబాబు హర్షం

తుఫాను నష్టం రూ.4,526 కోట్లు!

2

కేంద్రానికి మధ్యంతర నివేదిక పంపిన రాష్ట్ర ప్రభుత్వం

నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

2

కూటమి శ్రేణులకు పవన్ అభినందనలు

ఇవి ఎన్నికలు కావు.. ఎంపికలే!

- స్థానిక సంస్థల ఫలితాలపై వైఎస్ జగన్ తీవ్ర అసంతృప్తి
- అడుగడుగునా అధికార పార్టీ అక్రమాలకు పాల్పడిందని ఆరోపణ

3





రాహుల్‌పై బీజేపీ విమర్శలు

- 'జుగుప్సాకరమైన వ్యక్తి' అంటూ మండిపడ్డ కేశవన్
- విదేశీ సాయంతోనే మోదీ అధికారంలో ఉన్నారన్న ఆరోపణలపై ఆగ్రహం
- విదేశీ జోక్యాన్ని కోరింది రాహులేనని విమర్శ

4

నిరసన హక్కు ఉంది..

ఇతరుల హక్కులనూ గౌరవించాలి!

- ఆందోళనల పేరుతో బహిరంగ ప్రదేశాలను నిరవధికంగా ఆక్రమించలేరు
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- నిరసన నిర్వాహకులను ప్రతివాదులుగా చేర్చాలని న్యాయస్థానం ఆదేశం

4



జగన్‌ను జనం మడతపెట్టేశారు!



- అభివృద్ధి, సంక్షేమానికే ఓటర్ల పట్టం
- పెనుకొండ పురపోరులో కూటమి ఘన విజయం
- పరిషత్ ఎన్నికల్లోనూ ఏకపక్షంగా గెలుస్తాం
- విజేతల సత్కార సభలో మంత్రి సవిత ధీమా

2

ఏపీకి మరో తుపాను ముప్పు!

- నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలతో పాటు తమిళనాడుపై ప్రభావం
- గమనం, తీవ్రతపై ఇంకా రావాల్సిన స్పష్టత

2

నవంబర్ 15 తర్వాత బంగాళాఖాతంలో తుపానుకు అవకాశం





3

మానవ హక్కుల పరిరక్షకుడు

జస్టిస్ చంద్రయ్య

నిరుపేద కుటుంబం నుంచి అత్యున్నత స్థాయికి..

సామాన్యుల పక్షాన నిలిచిన గొప్ప వ్యక్తి అని కొనియాడిన లీసా గిల్

స్థానిక సమరంలో కూటమి సునామీ!

- పుర, నగర పాలక పీఠాలన్నీ ఎన్డీయే పక్షాల కైవసం
- పోలింగ్‌కు ముందే 17 అధ్యక్ష పదవులు కూటమి ఖాతాలో ఏకగ్రీవం
- విశాఖ, విజయవాడ సహా అన్ని నగరాల్లోనూ విపక్షానికి చేదు అనుభవం
- మాజీ ముఖ్యమంత్రి సొంత గడ్డ పులివెందులలో ఎగిరిన పసుపు జెండా
- రాష్ట్రవ్యాప్తంగా కేవలం నందికొట్కూరుకే పరిమితమైన వైఎస్సార్సీపీ
- దాదాపు మూడు వేలకు పైగా వార్డుల్లో అధికార కూటమిదే విజయదుందుభి
- మురసు తుఫానుతో ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో లెక్కింపునకు తీవ్ర ఆటంకం



అమరావతి, నవంబర్ 3 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో అధికార తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి సరికొత్త చరిత్ర సృష్టించింది. కౌన్సిలర్ల ద్వారా కాకుండా ప్రజలే నేరుగా తమ నగర ప్రథమ పౌరుడిని, పురపాలక అధ్యక్షుడిని ఎన్నుకునేలా నిర్వహించిన ఈ ప్రత్యక్ష ఎన్నికల్లో ఓటర్లు కూటమి అభ్యర్థులకు బ్రహ్మరథం పట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 92 పట్టణ స్థానిక సంస్థలకు (13 నగర పాలక సంస్థలు, 79 పురపాలక, నగర పంచాయతీలు) ఎన్నికలు జరగ్గా.. అధికార పక్షాల దెబ్బకు విపక్ష వైఎస్సార్సీపీ చిరునామా గల్లంతైంది.

ఏకగ్రీవాల జోరు..

ఎన్నికల పోలింగ్‌కు ముందే కూటమి అభ్యర్థులు ఏకంగా 17 పురపాలక సంఘాల అధ్యక్ష స్థానాలను ఏకగ్రీవంగా కైవసం చేసుకుని సత్తా చాటారు. ఇందులో తెలుగుదేశం పార్టీ అత్యధికంగా 15 స్థానాలను సొంతం చేసుకోగా.. జనసేన, బీజేపీ ఒక్కో పీఠాన్ని దక్కించుకున్నాయి. అన్నమయ్య జిల్లా రాయచోటి పురపాలక సంఘంలో అయితే ఏకంగా మొత్తం 44 వార్డులనూ తెలుగుదేశం ఏకగ్రీవంగా గెలుచుకోవడం విశేషం. బద్వేలు, పిడుగురాళ్ల, గురజాల, దాచేపల్లి, కనిగిరి, నగరి, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల్లో పసుపు పార్టీ అధ్యక్ష పదవులను ముందుగానే ఖాయం చేసుకుంది. జనసేన పార్టీ తరఫున ప్రకాశం జిల్లా దర్శిలో, బీజేపీ తరఫున ఎర్రగుంట్లలో అధ్యక్ష పదవులు ఏకగ్రీవమయ్యాయి.

నగర పాలక పీఠాలపై ఎన్డీయే జెండా..

రాష్ట్రంలోని 13 నగర పాలక సంస్థల్లోనూ కూటమి దెబ్బకు ప్రతిపక్షం కుదేలైంది. కూటమి ఒప్పందంలో భాగంగా తెలుగుదేశం పార్టీ పది స్థానాల్లో పోటీ చేయగా, జనసేన రెండు, బీజేపీ ఒక స్థానంలో బరిలోకి దిగాయి. విశాఖపట్నంలో తెలుగుదేశం అభ్యర్థి ముక్కా శ్రావణి బంపర్ మెజారిటీతో నెగ్గగా.. గుంటూరులో కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, విజయనగరంలో అవనాపు భార్గవి, కడపలో నెల్లటూరి సువర్ణ, నెల్లూరులో రూప్ కుమార్ యాదవ్, మచిలీపట్నంలో అబిదా విజయం సాధించారు. విజయవాడలో జనసేన అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ, ఏలూరులో అప్పలనాయుడు ఘన విజయం సాధించి ఆ పార్టీకి తొలిసారి నగర ప్రథమ పౌరుల పీఠాలు అందించారు. అనంతపురంలో కమలం పార్టీ అభ్యర్థి అజేష్ బాబు తిరుగులేని ఆధిక్యం ప్రదర్శించారు.

పురపాలక సంఘాల్లోనూ అదే హవా..

మిగిలిన పురపాలక సంఘాల ఫలితాలను పరిశీలిస్తే ఎన్డీయే కూటమి సునామీ సృష్టించిందనే చెప్పాలి. ప్రతిపక్ష నేత సొంత నియోజకవర్గం పులివెందులలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించి కంచుకోటను బద్దలు కొట్టారు. జమ్మలమడుగు, మైదుకూరు, ఎమ్మిగనూరు, మాచర్ల, నందిగామ తదితర ప్రాంతాల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులు అధ్యక్షులుగా గెలుపొందారు. అటు జనసేన పార్టీ పిఠాపురం, తెనాలి, పెడన, తిరువూరు, నిడదవోలు, గొల్లప్రోలు తదితర పురపాలక సంఘాల్లో జయకేతనం ఎగురవేసింది. ప్రతిపక్ష వైఎస్సార్సీపీ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నందికొట్కూరు పురపాలక సంఘంలో మాత్రమే గెలిచి పరువు నిలుపుకుంది.

వార్డుల్లోనూ కూటమే కింగ్..

మొత్తం 92 స్థానిక సంస్థల పరిధిలోని 3,942 వార్డులకు గానూ అధికార కూటమి ఏకపక్ష విజయాలు నమోదు చేసింది. ఇందులో తెలుగుదేశం పార్టీ అత్యధికంగా 1,600 పైచిలుకు వార్డులను తన ఖాతాలో వేసుకోగా.. జనసేన 260కి పైగా స్థానాల్లో, బీజేపీ సుమారు 90కి పైగా వార్డుల్లో గెలుపొందాయి. విపక్ష వైఎస్సార్సీపీ కేవలం 230కి అటుఇటుగా వార్డులకే పరిమితమై భారీ మూల్యం చెల్లించుకుంది. ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు రాయలసీమలోని పెనుకొండ లాంటి ప్రాంతాల్లో వంద శాతం వార్డులన్నీ కూటమి పక్షానే నిలిచాయి.

తుఫానుతో లెక్కింపునకు బ్రేక్..


రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు సజావుగా ప్రారంభమైనప్పటికీ.. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో మురసు తుఫాను కారణంగా భారీ ఆటంకం ఏర్పడింది. ప్రతికూల వాతావరణం, ఎడతెరిపిలేని వర్షాల దృష్ట్యా బాపట్ల జిల్లా చీరాలతో పాటు ఆయా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియను అధికారులు తాత్కాలికంగా వాయిదా వేశారు. వాతావరణం సద్దుమణిగిన వెంటనే ఆయా చోట్ల తదుపరి లెక్కింపు చేపట్టనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు స్పష్టం చేశారు.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం!

పట్టణాల్లో జనసేనకు బలీయమైన మద్దతు దక్కింది

కూటమి శ్రేణులకు అభినందనలు తెలిపిన పవన్ కల్యాణ్

అమరావతి, నవంబర్ 3 (సమయం న్యూస్) : ఓటింగ్ యంత్రాల ద్వారా జరిగే సాధారణ ఎన్నికలైనా.. ఓటు పత్రాలతో (బ్యాలెట్) నిర్వహించే స్థానిక సమరమైనా ప్రజల మద్దతు ఎప్పుడూ కూటమి పక్షానే ఉంటుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన విపక్షాలు ఓటింగ్ యంత్రాలపై నెపం వేశాయని.. ఇప్పుడు ఓటు పత్రాలతో జరిగిన నగర, పురపాలక ఎన్నికల్లోనూ ప్రజలు కూటమికి అదే స్థాయి అఖండ విజయాన్ని కట్టబెట్టారని ఆయన గుర్తుచేశారు. నగర పాలక, పుర పాలక, నగర పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సాధించిన భారీ గెలుపుపై పవన్ మంగళవారం ఒక ప్రకటనలో తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రజల్లో ఉన్న అపారమైన నమ్మకానికి ఈ స్థానిక ఫలితాలే అసలైన నిదర్శనమని పవన్ వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో జనసేనకు బలీయమైన ప్రజాదరణ లభించిందని.. నగర, పురపాలక అధ్యక్ష స్థానాల్లో తమ అభ్యర్థులు సాధించిన ఆధిక్యతలు పట్టణ ప్రాంతాల్లో జనసేనకున్న బలాన్ని చాటుతున్నాయని ఆయన వివరించారు. ఓటర్లు తమపై ఉంచిన అపార నమ్మకాన్ని కచ్చితంగా నిలబెట్టుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర సర్కారు అందిస్తున్న సంపూర్ణ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి అపార పరిపాలనా అనుభవంతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని పవన్ ఆకాంక్షించారు. ఈ పట్టణ ఎన్నికల్లో సాధించిన అద్భుత విజయాన్నే.. రాబోయే మండల, జిల్లా పరిషత్ (ఎంపీటీసీ, జడ్పీటీసీ) ఎన్నికల్లోనూ పునరావృతం చేస్తామనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. అహర్నిశలు శ్రమించి కూటమి విజయానికి బాటలు వేసిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా పవన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



జగన్‌ను జనం మడతపెట్టేశారు!

విజేతల సత్కార సభలో మంత్రి సవిత ధీమా

పెనుకొండ, నవంబర్ 3 (సమయం న్యూస్) : రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు అభివృద్ధికి పట్టం కడుతూ స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు బ్రహ్మరథం పట్టారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. చొక్కా మడతపెడతానని ప్రగల్భాలు పలికిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజలే మడతపెట్టి పక్కన పడేశారని ఆమె ఎద్దేవా చేశారు. పెనుకొండ పురపాలక సంఘంలో చైర్మన్ స్థానంతో పాటు మొత్తం 23 వార్డులను కూటమి కైవసం చేసుకున్న నేపథ్యంలో మంగళవారం పట్టణంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉచిత వంటగ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ లాంటి పథకాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయని, అందుకే ఈ అఖండ విజయం కట్టబెట్టారని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

పరిషత్ పోరులోనూ ఇదే జోరు..

పెనుకొండ ఓటర్ల ఆదరాభిమానాలతో పురపాలక సంఘాన్ని పూర్తిగా కైవసం చేసుకున్నామని మంత్రి సవిత వివరించారు. రాబోయే మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లోనూ ఈ స్థానిక ఫలితాలే పునరావృతం అవుతాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధికి ప్రజలు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని కొనియాడారు. అనంతరం విజయం సాధించిన చైర్మన్ అభ్యర్థి త్రివేంద్రమూర్తితో పాటు వార్డు కౌన్సిలర్లను మంత్రి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

సుపరిపాలనకే ప్రజల పట్టం!

- స్థానిక పోరులో కూటమి ప్రభుత్వానికే మద్దతు
- ప్రజా సమస్యల పరిష్కారానికే నా తొలి ప్రాధాన్యం
- ఉత్తమ రాజకీయాలు, మంచి పరిపాలనే మా విధానం
- ఎన్నికల ఫలితాలపై చంద్రబాబు హర్షం

అమరావతి, నవంబర్ 3 (సమయం న్యూస్) : కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనకు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పు ద్వారా సంపూర్ణ మద్దతు తెలిపారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల ఫలితాలపై మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి అద్భుతమైన ప్రజామోదం లభించిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తోందనే నమ్మకం ప్రజల్లో బలంగా ఉందని, అందుకే పట్టణ ప్రాంత ఎన్నికల్లో తమకు అండగా నిలిచారని సీఎం స్పష్టం చేశారు. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే తమ పాలన సాగుతోందని ఆయన ఉద్ఘాటించారు.

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం..

రాజకీయాలా? ప్రజా సమస్యల పరిష్కారమా? అనే ప్రశ్న ఎదురైతే తాను కచ్చితంగా ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం ఇస్తానని చంద్రబాబు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. సేవలందించే క్రమంలో ఎక్కడైనా పొరపాట్లు జరిగితే వెంటనే వాటిని గుర్తించి సరిదిద్దుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేశామని ముఖ్యమంత్రి వివరించారు. సాగునీటి పనుల నిర్మాణాన్ని శరవేగంగా కొనసాగిస్తున్నామని, పోలవరం నిర్మాణాన్ని పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. వెలిగొండ జలాశయం ద్వారా ఇప్పటికే నీటిని అందించామని గుర్తుచేశారు. అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేశామని, రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి పక్కాగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.

అన్ని సమస్యలు తీరాయని చెప్పం..

రాష్ట్రంలో అన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని తాము ఏమాత్రం చెప్పడం లేదని, గత పాలకుల నుంచి వారసత్వంగా వచ్చిన అనేక సమస్యలు ఇంకా వేధిస్తూనే ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ



రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని ఆయన చెప్పారు. రాజకీయ పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా ప్రజలందరికీ సేవలు అందించడమే తమ ప్రభుత్వ విధానమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్తమ రాజకీయాలు, మంచి పరిపాలన అనేదే తన విధానమని ఆయన గుర్తుచేశారు. ప్రజలకు మంచి చేస్తే కచ్చితంగా వారే ప్రభుత్వానికి అండగా నిలుస్తారన్న నమ్మకం తనకుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, వారి ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు.

తుఫాను నష్టం రూ.4,526 కోట్లు!

- కేంద్రానికి మధ్యంతర నివేదిక పంపిన రాష్ట్ర ప్రభుత్వం
- విద్యుత్ పునరుద్ధరణకు పొరుగు రాష్ట్రాల సాయం కోరిన వైనం
- 17 జిల్లాల్లో రెండు నెలలకు సరిపడా నిత్యావసరాల నిల్వ
- 5 వేల మంది గర్భిణులను సురక్షితంగా ఆస్పత్రులకు తరలింపు
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబర్ 3 (సమయం న్యూస్) : తుఫాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ప్రాథమికంగా రూ.4,526 కోట్ల మేర నష్టం జరిగినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఈ విపత్తు వల్ల జరిగిన నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే ఒక మధ్యంతర నివేదిక పంపించామని, త్వరలోనే పూర్తి స్థాయి నివేదిక సమర్పిస్తామని ఆయన తెలిపారు. తుఫాను సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని రకాల సహాయక చర్యలు చేపట్టిందని ఆయన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు.

మీనమేషాలు లెక్కించం..

ప్రజలకు కష్టాలు వచ్చినప్పుడు మీనమేషాలు లెక్కించకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వేలాది చెట్లు నేలకూలినప్పటికీ భారీ వర్షంలోనే వాటిని తొలగించి రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ కోసం పొరుగు రాష్ట్రాల సహకారం తీసుకున్నామని చంద్రబాబు వివరించారు. తమిళనాడు, కర్ణాటక ముఖ్యమంత్రులతో పాటు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో స్వయంగా మాట్లాడి ఏపీలో నెలకొన్న పరిస్థితులను వివరించినట్లు చెప్పారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం సిబ్బందిని పంపాలని వారిని కోరినట్లు వెల్లడించారు.

అమిత్ షా అభయం..

రాష్ట్రంలో తుఫాను నష్టంపై కేంద్రానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించామని, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడగా అవసరమైన సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. కేంద్ర బృందాలు సైతం రాష్ట్రంలో పర్యటించి నష్టాన్ని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. 'అర్నబ్' తుఫాను కారణంగా 3.52 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 23,211 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. తాజా 'మురసు' తుఫాను నష్టంపై కూడా ప్రాథమిక అంచనాలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు..

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చంద్రబాబు వివరించారు. 17 జిల్లాల్లోని 19,265 చౌకధరల దుకాణాల్లో రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విపత్తు ప్రభావిత ప్రాంతాలకు చెందిన 5 వేల మంది గర్భిణులను ముందుజాగ్రత్తగా ఆస్పత్రులకు తరలించామని, గత వారం రోజుల్లోనే 1,029 మంది గర్భిణులకు సురక్షితంగా కాన్పులు జరిగాయని వెల్లడించారు. వైద్య శిబిరాలు, అత్యవసర వాహనాలు, ప్రాణరక్షక మందులతో పాటు పాముకాటు విరుగుడు మందులను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు చేపట్టడంతో పాటు రక్షిత మంచినీటిని సరఫరా చేస్తున్నామని, అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించినట్లు ముఖ్యమంత్రి వివరించారు.

బీమాతో పెట్టుబడికి పూర్తి రక్షణ!

రైతన్నలు ముందుకొచ్చేలా విస్తృత అవగాహన కల్పించాలి

ఈ నెలాఖరు కల్లా పంటకోత ప్రయోగాలు పూర్తి చేయాలి

పెట్టుబడి రాయితీ, బీమాతో అన్నదాతకు ఆర్థిక భరోసా

వ్యవసాయ అధికారుల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, నవంబర్ 3 (సమయం న్యూస్) : ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఏ ఒక్క రైతు, కౌలుదారు నష్టపోకుండా బీమా రక్షణ కవచంలా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం సచివాలయం నుంచి ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం సచివాలయం నుంచి ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వరుస తుఫాన్ల వల్ల వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని, పెట్టుబడి రాయితీతో పాటు బీమా అందితే రైతులకు ఆర్థిక భద్రత కలుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

పంటల బీమాలో ఏపీ ముందంజ..

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్ల పంటల బీమాలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఆరో స్థానంలో నిలిచిందని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సాగు కాలంలో 22 రకాల పంటలను బీమా పరిధిలోకి తెచ్చామన్నారు. ఈసారి 17.07 లక్షల మంది రైతుల పంటలకు బీమా కల్పించగా.. అందులో వరి, కందులు, పత్తి తదితర పంటల వాటాయే 90 శాతం ఉందని వివరించారు. పరిహారం పారదర్శకంగా అందేలా నెలాఖరు కల్లా 30,286 పంటకోత ప్రయోగాలు పూర్తి చేయాలన్నారు. అన్నదాతలు తమ వంతు బీమా రుసుము చెల్లించేలా అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు.

సాంకేతిక వేదికతో సేవలు..

రాష్ట్రంలోని 47 లక్షల మంది రైతుల్లో 20 లక్షల మంది వ్యవసాయ సాంకేతిక వేదికను తమ చరవాణుల్లో వినియోగిస్తున్నారని చంద్రబాబు వెల్లడించారు. పది లక్షల మంది దాన్ని నిత్యం వాడుతున్నారని, భవిష్యత్తులో ఆ వేదిక ద్వారానే పంట రుణాలు అందించాలని అధికారులకు సూచించారు. పంట నష్టం వివరాలన్నీ అందులోనే నమోదు చేయాలన్నారు. ఎన్నికల పనులు ఉన్నప్పటికీ రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ శాఖ అద్భుతంగా పనిచేస్తోందని ఆయన అభినందించారు.

ఏపీకి మరో తుపాను ముప్పు!

- నవంబర్ 15 తర్వాత బంగాళాఖాతంలో తుపానుకు అవకాశం
- నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలతో పాటు తమిళనాడుపై ప్రభావం
- గమనం, తీవ్రతపై ఇంకా రావాల్సిన స్పష్టత
- వరుస తుపాన్లు వచ్చే పరిస్థితి ఉందంటున్న నిపుణులు



అమరావతి, నవంబర్ 3 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌కు మరో తుపాను ముప్పు పొంచి ఉందన్న వాతావరణ అంచనాలు తీవ్ర ఆందోళన రేకెత్తిస్తున్నాయి. నవంబర్ 15 తర్వాత బంగాళాఖాతంలో మరో తుపాను ఏర్పడే అవకాశం ఉందని సమాచారం. నవంబర్, డిసెంబర్ నెలల్లో వరుసగా తుపాన్లు ఏర్పడే పరిస్థితులు ఉండొచ్చని తాజా అంచనాలు వెలువడుతున్నాయి. ఈ తుపానుల ప్రభావం ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలతో పాటు పొరుగున ఉన్న తమిళనాడుపై తీవ్రంగా ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే ఈ తుపాను ఆవిర్భావం, దాని దిశ, తీవ్రతపై ఇంకా పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. వాతావరణ శాఖ నుంచి వచ్చే తాజా హెచ్చరికలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

మానవ హక్కుల పరిరక్షకుడు జస్టిస్ చంద్రయ్య!

- నిరుపేద కుటుంబం నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగిన వైనం
- సామాన్యుల పక్షాన నిలిచిన గొప్ప వ్యక్తి అని కొనియాడిన లీసా గిల్
- చారిత్రక తీర్పులు వెలువరించిన మహనీయుడికి ఘన నివాళులు
- హైకోర్టులో నిర్వహించిన సంతాప సభలో స్మరించుకున్న న్యాయమూర్తులు



అమరావతి, నవంబర్ 3 (సమయం న్యూస్): మానవ హక్కుల కోసం నిరంతరం పరితపించిన గొప్ప వ్యక్తి జస్టిస్ జి.చంద్రయ్య అని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ కొనియాడారు. మంగళవారం హైకోర్టులోని ఒకటో నంబర్ న్యాయస్థానంలో జస్టిస్ చంద్రయ్య సంతాప సభను నిర్వహించారు. ముందుగా ఆయన మృతికి సంతాప సూచకంగా న్యాయమూర్తులంతా ఒక నిమిషం పాటు మౌనం పాటించి ఘన నివాళులు అర్పించారు. న్యాయస్థానంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆయన కుటుంబ సభ్యులు దృశ్య మాధ్యమం ద్వారా వీక్షించేలా ప్రత్యేక అవకాశం కల్పించారు.

ఉస్మానియాలో న్యాయశాస్త్రం అభ్యసించి..

ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ మాట్లాడుతూ.. జస్టిస్ చంద్రయ్య తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా తిమ్మాపూర్‌లో జన్మించారని గుర్తుచేశారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆయన ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యను తిమ్మాపూర్ తపాలపూర్‌లో పూర్తి చేసి.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఇంటర్మీడియట్, పట్టభద్రుల విద్యను పూర్తిచేశారన్నారు. ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసించారని తెలిపారు. 1980లో హైకోర్టు న్యాయవాదిగా వృత్తి చేపట్టి ఉమ్మడి రాష్ట్ర హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా రెండు పర్యాయాలు అద్భుతమైన సేవలు అందించారని వివరించారు.

అనేక చారిత్రక తీర్పులు..

2005లో ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా ఆయన నియమితులయ్యారు. పదవీ విరమణ అనంతరం తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తొలి అధ్యక్షుడిగా ఐదేళ్ల పాటు పనిచేశారు. జస్టిస్ చంద్రయ్య నెల్సన్ మండేలా పురస్కారంతో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ నుంచి మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకున్నారని లీసా గిల్ గుర్తుచేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిందని తెలిపారు. సామాజిక అసమానతలు, మానవ హక్కుల ఉల్లంఘనల వంటి అనేక అంశాలపై ఆయన చారిత్రక తీర్పులు వెలువరించారని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ప్రభునాథ్ తదితరులు జస్టిస్ చంద్రయ్య న్యాయ ప్రస్థానాన్ని స్మరించుకున్నారు. ఆయన చూపిన బాట అందరికీ ఆదర్శనీయమని ప్రశంసించారు. పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, ప్రభుత్వ న్యాయవాది ఎం.లక్ష్మీనారాయణ, న్యాయవాదుల మండలి అధ్యక్షుడు బాలాజీతో పాటు తదితరులు పాల్గొన్నారు.



సామాన్యులకే రాజ్యాధికారం!

నిడదవోలు పురపోరులో కూటమి అఖండ విజయం
దళిత యువతికి దక్కిన పురపాలక అధ్యక్ష పీఠం
ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయం నెరవేరింది
ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, నవంబర్ 3 (సమయం న్యూస్): నిడదవోలు పురపాలక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు అఖండ విజయం అందించిన పట్టణ ఓటర్లకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలోని ప్రభుత్వ సుపరిపాలనకు ఈ విజయమే అసలైన నిదర్శనమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. నిడదవోలు పట్టణంలోని మొత్తం 32 వార్డులకు గానూ ఏకంగా 28 స్థానాల్లో కూటమి గెలుపొందడం అభినందనీయమన్నారు. ఇందులో జనసేన 14, తెలుగుదేశం 13, బీజేపీ ఒక స్థానంలో భారీ ఆధిక్యంతో గెలుపొందాయని ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అభ్యర్థుల ఎంపిక నుంచి విజయం సాధించే వరకు మూడు పార్టీల నాయకులు అద్భుతమైన సయోధ్యతో పనిచేశారని, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు బూరుగుపల్లి శేషారావుతో కలిసి వేసిన వ్యూహం సత్ఫలితాలను ఇచ్చిందని చెప్పారు. ఎలాంటి ఆర్థిక బలం, ఆర్భాటం లేని ఒక సామాన్య దళిత యువతి మురాల జ్యోతి.. పురపాలక అధ్యక్షురాలి స్థాయికి ఎదగడం నిడదవోలు చరిత్రలోనే అత్యంత గర్వకారణమైన క్షణమని మంత్రి దుర్గేష్ భావోద్వేగానికి గురయ్యారు. సామాన్యులకు రాజ్యాధికారం కల్పించి ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టాలని పవన్ కల్యాణ్ పదే పదే చెప్పే మాటలను ఈ రోజు తాము నిజం చేసి చూపించామన్నారు. సామాన్య కుటుంబంలో పుట్టిన యువతి అధ్యక్షురాలిగా ఎదగడాన్ని నిష్పక్షపాతంగా సమాజానికి చూపించిన పత్రికా, ప్రసార మాధ్యమాలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సంబరాల్లో కూటమి శ్రేణులు..

పురపాలక ఎన్నికల్లో అద్భుత విజయం సాధించిన అధ్యక్షురాలు మురాల జ్యోతితో పాటు గెలుపొందిన వార్డు సభ్యులను మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ చారిత్రక విజయం సాధించిన సందర్భంగా పట్టణంలోని మంత్రి స్థానిక కార్యాలయం వద్ద కూటమి నాయకులు, కార్యకర్తలు పండగ వాతావరణంలో సంబరాలు జరుపుకున్నారు. కొత్తగా విజయం సాధించిన అభ్యర్థులకు మంగళ వాయిద్యాల నడుమ పూలవర్షం కురిపిస్తూ అభిమానులు, శ్రేణులు ఘన స్వాగతం పలికారు.

ఇప్పటికైనా తీరు మార్చుకోవాలి!

ఓటమితో ప్రతిపక్ష పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలి
కక్షలు, దాడులతో ప్రజల మనసులు గెలవలేరు
కూటమి ప్రభుత్వ పాలనకే స్థానిక ఓటర్ల మద్దతు
మదనపల్లెలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

మదనపల్లె, నవంబర్ 3 (సమయం న్యూస్) : ప్రతిపక్ష వైఎస్సార్సీపీ అరాచక రాజకీయాలకు, మాజీ ముఖ్యమంత్రి జగన్ అహంకారానికి ప్రజలు స్థానిక ఎన్నికల్లో మరోసారి గట్టి బుద్ధి చెప్పారని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. మదనపల్లె పురపాలక అధ్యక్షుడిగా కూటమి అభ్యర్థి గుండ్లపల్లి శ్రీరామ్ కుమార్ ఘన విజయం సాధించిన సందర్భంగా కౌంటింగ్ కేంద్రంలో మంత్రి జనార్దన్ రెడ్డి, మరో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆయనకు విజయ ధ్రువీకరణ పత్రం అందజేశారు. అనంతరం మంత్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. పురపోరు ఫలితాలు కూటమి ప్రభుత్వంపై ప్రజలకున్న నమ్మకానికి అసలైన నిదర్శనమన్నారు. మాటలతో మభ్యపెట్టే రాజకీయాలకు, అరాచకాలకు కాలం చెల్లిందని ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు.

జగన్ ద్వంద్వ వైఖరి..

అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను ఇబ్బందులకు గురిచేసి, ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం వైఎస్సార్సీపీ నేతల ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మంత్రి విమర్శించారు. దాడులు, రాజకీయ కక్షలతో ప్రజల మనసులను గెలవలేరని, విశ్వాసం పొందాలంటే అభివృద్ధి చేసి చూపించాలని హితవు పలికారు. జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో సైతం కూటమికి జనం బ్రహ్మరథం పట్టడం ప్రతిపక్ష రాజకీయ పరిస్థితికి అద్దం పడుతోందని వ్యాఖ్యానించారు. సొంత ప్రాంతంలోనే విశ్వాసం నిలబెట్టుకోలేని వారు.. రాష్ట్ర ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. ఈ ఫలితాలతోనైనా ఆత్మపరిశీలన చేసుకుని రాజకీయ ధోరణి మార్చుకోవాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో కూటమికి లభించిన ఈ ప్రజా మద్దతు రానున్న పరిషత్, సర్పంచ్ ఎన్నికల్లోనూ ఖాయంగా కొనసాగుతుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. అధ్యక్షుడిగా గెలిచిన శ్రీరామ్ కుమార్‌తో పాటు కూటమి కౌన్సిలర్లకు మంత్రులు అభినందనలు తెలిపారు.



ఇవి ఎన్నికలు కావు.. ఎంపికలే!

స్థానిక సంస్థల ఫలితాలపై వైఎస్ జగన్ తీవ్ర అసంతృప్తి
అడుగడుగునా అధికార పార్టీ అక్రమాలకు పాల్పడిందని ఆరోపణ
చంద్రబాబు, పోలీసు వ్యవస్థ, ఎన్నికల సంఘం లక్ష్యంగా విమర్శలు
సామాజిక మాధ్యమం వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేసిన మాజీ ముఖ్యమంత్రి

అమరావతి, నవంబర్ 3 (సమయం న్యూస్) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ, వెలువడుతున్న ఫలితాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, పోలీసు యంత్రాంగం, రాష్ట్ర ఎన్నికల సంఘం లక్ష్యంగా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన ఘాటైన పోస్ట్ పెట్టారు. విపక్షాలకు కనీసం పోటీ చేసే అవకాశం కూడా లేకుండా చేసి ఏకపక్షంగా ఎలా గెలవాలో ఆ ముగ్గురు నిరూపించారంటూ జగన్ తీవ్ర వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశలోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని జగన్ ఆరోపించారు. నామినేషన్లు వేయడం నుంచి వాటి పరిశీలన, ఉపసంహరణ వరకు అన్నింటినీ పూర్తిగా కబ్జా చేశారని విమర్శించారు. ఓటింగ్ రోజున వైఎస్సార్సీపీ ప్రతినిధులను తీవ్రంగా అడ్డుకోవడంతో పాటు కేంద్రాల నుంచి బలవంతంగా బయటకు లాగేశారని పేర్కొన్నారు. దొంగ ఓట్లతో అక్రమాలకు పాల్పడి, ఓటింగ్ శాతాన్ని తమకు అనుకూలంగా మార్చేశారని.. చివరికి ఓట్ల లెక్కింపును కూడా పూర్తిగా గుప్పిట్లో పెట్టుకున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగలేదని, ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకోలేదని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ప్రభుత్వమే తమకు కావలసిన అభ్యర్థులను ముందే ఎంపిక చేసుకుందని, ఇవి అసలు ఎన్నికలే కావని, కేవలం ఎంపికలు మాత్రమేనని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండాలంటే తక్షణం సమగ్రమైన ఎన్నికల సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు.



సాహస బాలికకు జగన్ అండ!

రాప్తాడు ఘటనలో గాయపడిన విద్యార్థిని లక్ష్మికి పరామర్శ

తాడేపల్లి, నవంబర్ 3 (సమయం న్యూస్) : అనంతపురం జిల్లా రాప్తాడు పాఠశాలలో జరిగిన దాడి ఘటనలో తన స్నేహితురాలిని రక్షించేందుకు సాహసం చేసిన పదో తరగతి విద్యార్థిని లక్ష్మికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి భరోసా కల్పించారు. అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెతో వైఎస్ జగన్ ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా స్నేహితురాలు గోపికను కాపాడిన తీరును ఆయన అభినందించారు. లక్ష్మికి మెరుగైన వైద్యం అందించేందుకు అయ్యే ఖర్చులన్నీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భరిస్తుందని, ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అవసరమైతే ఆమెను పెద్ద ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని రాప్తాడు పార్టీ ఇన్‌ఛార్జ్ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని జగన్ ఆదేశించారు.

రాష్ట్రాలకు విస్తరించిన విపక్షాల ఉద్యమం!

ఓటర్ల జాబితాల సవరణపై ఆందోళనల ఉధృతి
బెంగళూరులో ఐదో తేదీన భారీ నిరసన సభ
ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామాకు పట్టు
పల్లె స్థాయికి ఉద్యమాన్ని తీసుకెళ్లనున్న ఇండియా కూటమి

బెంగళూరు, నవంబర్ 3 (సమయం న్యూస్) : ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష ఇండియా కూటమి తమ నిరసనలను తీవ్రతరం చేసింది. ఢిల్లీకే పరిమితమైన ఈ ఉద్యమాన్ని రాష్ట్రాల స్థాయికి సైతం విస్తరించాలని ఆ కూటమి నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల ఐదో తేదీన బెంగళూరులో భారీ ఆందోళన చేపట్టనుంది. దేశ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తమ పదవికి రాజీనామా చేయాలని విపక్ష నేతలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

మండల స్థాయికి ఆందోళనలు..

ఈ నెల ఒకటో తేదీన దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన భారీ ప్రదర్శనకు రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ తదితర అగ్రనేతలు హాజరయ్యారు. ఈ ఉద్యమాన్ని ఇకపై జిల్లా, తాలూకా, మండల స్థాయిలకు సైతం ఉధృతంగా తీసుకెళ్లనున్నట్లు కర్ణాటక కాంగ్రెస్ నేత బీకే హరిప్రసాద్ వెల్లడించారు. వివాదస్పదమైన ఓటర్ల జాబితాల సవరణను వెంటనే రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల అధికారి రాజీనామాతో పాటు ఆయన నియామక విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని ఆ రాష్ట్ర వామపక్ష నేత కే. ప్రకాశ్ డిమాండ్ చేశారు. అధికార కమలం పార్టీ దేశాన్ని మతతత్వ దేశంగా మార్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

విద్యార్థి నేత వ్యాఖ్యలపై భగ్గుమన్న కమలం!

ఆలయాలు, పూజారులు, కుల వ్యవస్థపై విమర్శలతో దుమారం

న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమయం న్యూస్) : అఖిల భారత విద్యార్థి సంఘం నాయకురాలు నేహా బోరా చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. ఆలయాలు, పూజారులు, కుల వ్యవస్థను ఉద్దేశించి ఆమె చేసిన విమర్శలపై భారతీయ జనతా పార్టీ తీవ్ర స్థాయిలో మండిపడింది. మహిళలకు ముఖ్యంగా బ్రాహ్మణీయ వ్యవస్థ నుంచి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని, ఆలయాల్లో పూజారులు సైతం అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మాటలు హిందూ మతాన్ని కించపరిచేలా ఉన్నాయని కమలం పార్టీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేహా బోరా మాటలు గతంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను పోలి ఉన్నాయని భండారీ ఆరోపించారు. ఆలయాలకు వెళ్లి దేవతలను పూజించే వారే.. బస్సుల్లో మహిళలను వేధిస్తున్నారంటూ రాహుల్ గతంలో చేసిన వ్యాఖ్యలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకులు గతంలో ఉపయోగించిన 'హిందూ ఉగ్రవాదం', 'కాషాయ ఉగ్రవాదం' లాంటి పదాలను ప్రస్తావిస్తూ.. సనాతన ధర్మాన్ని లక్ష్యంగా చేసుకుని ఆ పార్టీ భావజాల ప్రచారం సాగిస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. నేహా బోరా వ్యాఖ్యలకు పొరుగు దేశమైన బంగ్లాదేశ్ ఛాందసవాదుల భావజాలమే ప్రధాన ప్రేరణగా ఉందని భండారీ తీవ్రస్థాయిలో విమర్శించారు.

సంపాదకీయం



నడి సముద్రంలో భారత శౌర్యం..
భద్రతకు భరోసా!

సముద్ర దొంగల చెర నుంచి ఇరాన్ మత్స్యకార నౌకకు విముక్తి

48 గంటల సాహసోపేత ఆపరేషన్‌లో 20 మంది సిబ్బందికి ప్రాణరక్షణ

సముద్రం దేశాల మధ్య దూరాన్ని పెంచే జలరాశి మాత్రమే కాదు.. ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను అనుసంధానించే ప్రధాన వాణిజ్య మార్గం కూడా. అలాంటి సముద్ర మార్గాల్లో భద్రతకు ముప్పు ఏర్పడితే దాని ప్రభావం ఒక్క దేశానికే పరిమితం కాదు. అంతర్జాతీయ వాణిజ్యం, రవాణా, మత్స్యకారుల జీవనోపాధి, దేశాల మధ్య సంబంధాలపైనా పడుతుంది. ఈ నేపథ్యంలో అరేబియా సముద్రంలో సముద్ర దొంగల చెరలో చిక్కుకున్న ఇరాన్ మత్స్యకార నౌకను భారత నౌకాదళం విడిపించిన ఘటన ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. భారత వైమానిక దళం సహకారంతో నిర్వహించిన ఈ సాహసోపేత కార్యాచరణ సముద్ర భద్రత విషయంలో భారత్ సామర్థ్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. అరేబియా సముద్రంలో అక్టోబర్ 29న ఇరాన్‌కు చెందిన 'అజిని' మత్స్యకార నౌకను సోమాలియా సముద్ర దొంగలు హైజాక్ చేసినట్లు సమాచారం అందింది. నౌకలో ఉన్న 20 మంది సిబ్బంది ప్రాణాలు ప్రమాదంలో పడటంతో భారత నౌకాదళం అప్రమత్తమైంది. సముద్రంలో సుదూర ప్రాంతంలో ఉన్న నౌకను గుర్తించడం, దాని కదలికలను పర్యవేక్షించడం, అందులోని సిబ్బందికి ఎలాంటి హాని జరగకుండా విడిపించడం అత్యంత క్లిష్టమైన పని. అయినప్పటికీ భారత దళాలు సమన్వయంతో కార్యాచరణ చేపట్టాయి. ముంబయికి సుమారు మూడు వేల కిలోమీటర్ల దూరంలో నౌకను గుర్తించి, సముద్ర దొంగలను అడ్డుకున్నాయి. దాదాపు 48 గంటలపాటు సాగిన ఆపరేషన్ నవంబర్ 2న విజయవంతంగా ముగిసింది. ఎలాంటి ప్రాణనష్టం లేకుండా 20 మంది సిబ్బందిని రక్షించడం ఈ కార్యాచరణలో అత్యంత ముఖ్యమైన అంశం. సముద్ర దొంగలపై చర్యలు తీసుకోవడమంటే కేవలం ఆయుధాలతో ఎదురుదాడి చేయడం కాదు. బందీలుగా చిక్కుకున్న అమాయకుల ప్రాణాలను కాపాడుతూ పరిస్థితిని అదుపులోకి తీసుకురావడం అసలైన సవాల్. ఒక్క పొరపాటు జరిగినా నౌకలోని సిబ్బంది ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంటుంది. అందుకే ఇటువంటి ఆపరేషన్లలో వ్యూహాత్మక ప్రణాళిక, కచ్చితమైన సమాచారం, దళాల మధ్య సమన్వయం అత్యంత అవసరం. తాజా ఘటనలో భారత నౌకాదళానికి వైమానిక దళం సకాలంలో సహకరించడం విజయానికి దోహదపడింది. రెండు దళాలు సమన్వయంతో పనిచేస్తే క్లిష్టమైన పరిస్థితుల్లోనూ సానుకూల ఫలితాలు సాధించవచ్చనే సందేశాన్ని ఈ ఘటన అందించింది. హిందూ మహాసముద్రం ప్రపంచ వాణిజ్యంలో అత్యంత కీలకమైన ప్రాంతం. ఆసియా, ఆఫ్రికా, ఐరోపా దేశాల మధ్య సరకు రవాణాలో ఈ సముద్ర మార్గాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. చమురు, సహజ వాయువు, ఆహార ధాన్యాలు, పారిశ్రామిక ముడిసరకులు వంటి అనేక వస్తువులు నౌకల ద్వారానే రవాణా అవుతున్నాయి. ఈ మార్గాల్లో సముద్ర దొంగల దాడులు పెరిగితే నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. రవాణా వ్యయాలు పెరగడంతోపాటు అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ముఖ్యంగా చిన్న మత్స్యకార నౌకల్లో పనిచేసే సిబ్బంది భద్రత ప్రశ్నార్థకమవుతుంది. అందువల్ల సముద్ర దొంగల నియంత్రణను కేవలం ఒక దేశానికి సంబంధించిన సమస్యగా చూడకూడదు. అంతర్జాతీయ సహకారంతో ఎదుర్కోవాల్సిన ఉమ్మడి సవాల్‌గా పరిగణించాలి. భౌగోళికంగా హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్‌కు ప్రత్యేక స్థానం ఉంది. సుదీర్ఘ తీరప్రాంతం, కీలక నౌకాశ్రయాలు, సముద్ర వాణిజ్యంపై ఆధారపడిన ఆర్థిక కార్యకలాపాలు దేశానికి సముద్ర భద్రతను అత్యంత ముఖ్యమైన అంశంగా మార్చాయి. భారత నౌకాదళం దేశ తీరప్రాంతాల రక్షణతోపాటు అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో భద్రతకు సహకరిస్తోంది. ప్రమాదంలో చిక్కుకున్న విదేశీ నౌకలకు సహాయం అందించడం ద్వారా సముద్ర భద్రతలో బాధ్యతాయుత భాగస్వామిగా వ్యవహరిస్తోంది. తాజా ఘటనలో రక్షించబడింది ఇరాన్‌కు చెందిన నౌక కావడం గమనార్హం. మానవ ప్రాణాల రక్షణకు దేశాల సరిహద్దులు అడ్డంకి కాకూడదనే మానవతా దృక్పథానికి ఇటువంటి చర్యలు నిదర్శనంగా నిలుస్తాయి. సముద్ర దొంగల కదలికలను ముందుగానే గుర్తించడం భద్రతా వ్యవస్థల ముందున్న ప్రధాన సవాల్. వేలాది కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న సముద్ర ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షించడం సాధారణ విషయం కాదు. ఇందుకోసం ఆధునిక నిఘా వ్యవస్థలు, ఉపగ్రహ సమాచారం, గగనతల పర్యవేక్షణ, నౌకల మధ్య సమాచార మార్పిడి కీలకం. సముద్రంలో అనుమానాస్పద కదలికలను గుర్తించిన వెంటనే సంబంధిత దేశాల నౌకాదళాలకు సమాచారం చేరే విధంగా అంతర్జాతీయ వ్యవస్థలను బలోపేతం చేయాలి. ముఖ్యంగా మత్స్యకార నౌకలకు అత్యవసర సమాచార వ్యవస్థలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. దాడి జరిగిన తర్వాత స్పందించడం ఎంత ముఖ్యమో, దాడులు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అంతకంటే ముఖ్యం. భారత నౌకాదళం చేపట్టిన ఆపరేషన్‌పై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసలు వ్యక్తం చేశారు. 48 గంటలపాటు సాగిన కార్యాచరణను విజయవంతంగా పూర్తి చేయడంలో నౌకాదళం చూపిన సామర్థ్యాన్ని అభినందించారు. భారత వైమానిక దళం సకాలంలో అందించిన సహకారాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. సముద్రంలో ఎదురయ్యే సంక్లిష్టమైన భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో భారత సాయుధ దళాల సమర్థతకు ఈ ఘటన నిదర్శనమని పేర్కొన్నారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో భద్రతకు భారత్ తన సహకారాన్ని కొనసాగిస్తుందన్న ఆయన వ్యాఖ్యలు సముద్ర రక్షణకు దేశం ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయి. సముద్ర దొంగల చెర నుంచి 20 మంది సిబ్బందిని రక్షించడం అభినందనీయమే. అయితే ఈ విజయంతో సమస్య పూర్తిగా పరిష్కారమైందని భావించకూడదు. సోమాలియా తీరప్రాంతం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ పరిసరాల్లో సముద్ర దొంగల ముప్పు అంతర్జాతీయ నౌకా రవాణాకు సవాల్‌గా కొనసాగుతోంది. ఆర్థిక అస్థిరత, బలహీనమైన తీరప్రాంత పరిపాలన, అక్రమ కార్యకలాపాలు వంటి అంశాలు సముద్ర దోపిడీకి అనుకూల పరిస్థితులను సృష్టించవచ్చు. కేవలం సైనిక చర్యలతోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యం కాదు. సంబంధిత దేశాల మధ్య సమాచార సహకారం, చట్టపరమైన చర్యలు, తీరప్రాంత భద్రత బలోపేతం వంటి అంశాలపైనా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. యుద్ధ నౌకల శక్తి, ఆధునిక ఆయుధాల సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానం దేశ రక్షణకు ఎంత ముఖ్యమో, వాటిని మానవ ప్రాణాల పరిరక్షణకు వినియోగించడం కూడా అంతే ముఖ్యం. సముద్ర దొంగల చెరలో చిక్కుకున్న 20 మంది సిబ్బందిని సురక్షితంగా విడిపించడం ద్వారా భారత దళాలు ఆ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాయి. సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రాకపోకలు కొనసాగాలంటే భద్రతతోపాటు అంతర్జాతీయ విశ్వాసం అవసరం. తాజా కార్యాచరణ ఆ విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే అవకాశముంది.

రాహుల్‌పై బీజేపీ తీవ్ర విమర్శలు!

- 'జుగుప్సాకరమైన వ్యక్తి' అంటూ మండిపడ్డ సీఆర్ కేశవన్
- విదేశీ సాయంతోనే మోదీ అధికారంలో ఉన్నారన్న రాహుల్ ఆరోపణలపై ఆగ్రహం
- దేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని కోరింది రాహులేనని విమర్శ
- కాంగ్రెస్‌కు విదేశీ సంస్థలతో సంబంధాలున్నాయని ఆరోపణలు
- రహస్య విదేశీ పర్యటనల వెనుక అజెండా ఏమిటని ప్రశ్న



న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమయం న్యూస్): విదేశీ శక్తుల సహకారంతోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలో కొనసాగుతున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. రాహుల్ వ్యాఖ్యలను తప్పుబట్టిన బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ ఆయనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీని 'జుగుప్సాకరమైన వ్యక్తి'గా అభివర్ణిస్తూ విమర్శలు గుప్పించారు. నిరాధారమైన ఆరోపణలు చేయడం, చివరకు నవ్వులపాలు కావడం రాహుల్‌కు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా రాహుల్ వ్యాఖ్యలను ఖండించారు. బీజేపీ ఆర్థిక వ్యవస్థను విదేశీయులే నియంత్రిస్తున్నారని, విదేశీ సహకారంతోనే మోదీ ప్రభుత్వం అధికారంలో కొనసాగుతోందని రాహుల్ గాంధీ ఆరోపించిన నేపథ్యంలో ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం ముదిరింది. రాహుల్ ఆరోపణలకు ఆధారాలేమిటని బీజేపీ ప్రశ్నిస్తోంది. మరోవైపు కేశవన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 2023 మార్చిలో బ్రిటన్ పర్యటన సందర్భంగా భారత ప్రజాస్వామ్యంపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను కేశవన్ ప్రస్తావించారు. దేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని కోరింది రాహులేనని ఆరోపించారు. అప్పట్లో రాహుల్ మాట్లాడిన వీడియోను తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్నారు. భారత ప్రజాస్వామ్యం గురించి విదేశీ గడ్డపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని విమర్శించారు. కాంగ్రెస్ నాయకత్వానికి ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని ప్రజాస్వామ్య నాయకుల వేదికతో సంబంధాలు ఉన్నాయని కేశవన్ ఆరోపించారు. జార్జ్ సోరోస్‌కు సంబంధించిన ఫౌండేషన్ నుంచి కాంగ్రెస్‌కు నిధులు అందాయని కూడా పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన స్వతంత్ర ఆధారాలు వెల్లడికాలేదు. బీజేపీ చేసిన ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించలేము. రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపైనా కేశవన్ ప్రశ్నలు సంధించారు. రాహుల్ తరచూ రహస్యంగా విదేశాలకు ఎందుకు వెళ్లున్నారని, అక్కడ ఎవరిని కలుస్తున్నారని నిలదీశారు. ఆ సమావేశాల వెనుక అసలు అజెండా ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. దేశ రాజకీయాల్లో విదేశీ ప్రభావం గురించి మాట్లాడే ముందు రాహుల్ తన విదేశీ సంబంధాలపై స్పష్టత ఇవ్వాలని కేశవన్ వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీపై రాహుల్ చేసిన ఆరోపణలు, వాటికి ప్రతిగా బీజేపీ సంధించిన విమర్శలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అయితే ఇరుపక్షాలు చేసిన విదేశీ ప్రభావం, నిధుల సంబంధిత ఆరోపణలకు స్వతంత్ర ధ్రువీకరణ అవసరం. రాజకీయ విమర్శలకంటే వాటికి సంబంధించిన ఆధారాలే కీలకమన్న అంశం ఈ వివాదంతో మరోసారి ముందుకొచ్చింది.

త్రిపురలో ఘోరం

బీఎస్ఎఫ్ జవాన్లపై కర్రలతో దాడి..

ఆయుధాలు సైతం లాక్కొనే యత్నం!



అగర్తలా, నవంబర్ 3 (సమయం న్యూస్): త్రిపుర సరిహద్దు ప్రాంతంలో ఊహించని ఘోర సంఘటన వెలుగులోకి వచ్చింది. దేశ రక్షణలో అహర్నిశలు శ్రమిస్తున్న సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) జవాన్లపై స్మగ్లర్లు బరితెగించి దాడులకు తెగబడ్డారు. సీపాహిజాలా జిల్లాలోని బోక్సానగర్ పరిధిలో గల ఆశబరి సరిహద్దు ప్రాంతంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. సరిహద్దుల నుంచి నిషేధిత వస్తువులను అక్రమంగా బంగ్లాదేశ్‌కు రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారంతో గస్తీ తిరుగుతున్న బీఎస్ఎఫ్ జవాన్లు రెహమాన్ అనే ప్రధాన స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి అరెస్టును జీర్ణించుకోలేని మిగతా స్మగ్లర్లు, కొందరు స్థానిక గ్రామస్థులు ఒక్కసారిగా జవాన్ల వాహనాన్ని చుట్టుముట్టారు. చేతుల్లో కర్రలు, పదునైన ఆయుధాలు పట్టుకుని జవాన్లపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. అంతేకాకుండా జవాన్ల తలలపై విచక్షణారహితంగా కొట్టి, వారి వద్ద ఉన్న ఆయుధాలను లాక్కునేందుకు ప్రయత్నించడం తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణ దాడిలో పలువురు జవాన్లు తీవ్రంగా గాయపడటంతో పాటు ప్రభుత్వ వాహనం కూడా దారుణంగా ధ్వంసమైంది. ఈ ఘటన వెనుక సరిహద్దు ఆవల ఉన్న బంగ్లాదేశీయుల ప్రమేయం కూడా ఉందనే వార్తలు వస్తుండటంతో సరిహద్దు గ్రామాల్లో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు. శాంతిభద్రతలను విచ్ఛిన్నం చేస్తూ దేశ రక్షణ బాధ్యతల్లో ఉన్న బీఎస్ఎఫ్ జవాన్లపై దాడులకు తెగబడటం ఏమాత్రం సహించరాని అపరాధమని స్పష్టం చేశారు. దాడికి పాల్పడిన ఉగ్ర మూకలను ఎంతమాత్రం విడిచిపెట్టేది లేదని, వారిపై చట్టప్రకారం అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో అదనపు భద్రతా బలగాలను మోహరించి, దాడి చేసి పరారైన నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు.

నేపాల్‌లో రెండు హెలికాప్టర్లు ఢీ
భారతీయుడి మృతి!

ల్యాండింగ్ సమయంలో ఒకదానికొకటి తగిలిన రోటర్లు

సోలుఖుంబు ప్రాంతంలోని ఫెరిచే హెలిప్యాడ్ వద్ద ప్రమాదం



కాఠ్‌మాండు/న్యూ ఢిల్లీ, నవంబర్ 3 (సమయం న్యూస్): పొరుగు దేశమైన నేపాల్‌లో మంగళవారం ఉదయం అత్యంత భయానక వాయు ప్రమాదం సంభవించింది. సోలుఖుంబు జిల్లాలోని ఫెరిచే హెలిప్యాడ్ వద్ద ల్యాండింగ్ సమయంలో రెండు చిన్న హెలికాప్టర్లు అనూహ్యంగా ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ దారుణ ఘటనలో భారత పర్యాటకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, ఒక ఎన్ఆర్ఐ సహా పైలట్ తీవ్రంగా గాయపడ్డారని నేపాల్ పోలీసులు అధికారికంగా వెల్లడించారు. తమకు అత్యంత సమీపంలోనే రొటేటింగ్ వింగ్స్ ఢీకొనడంతో హెలిప్యాడ్ పరిసరాల్లో ఉన్న ప్రజలు, పర్యాటకులు భయాందోళనలతో పరుగులు తీశారు. ల్యాండింగ్‌కు కొద్ది క్షణాల ముందు 'ఫిష్‌టెయిల్ ఎయిర్', 'ఎయిర్ డైనాస్టీ' సంస్థలకు చెందిన రెండు హెలికాప్టర్ల రోటర్లు బలంగా తాకడంతో ఈ ప్రమాదం జరిగింది. ఫిష్‌టెయిల్ ఎయిర్ హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న భారతీయ పర్యాటకుడు తీవ్ర గాయాలపాలై మరణించారు. మృతి చెందిన వ్యక్తిని తమిళనాడులోని చెన్నై నగరానికి చెందిన వసంత్ కుమార్ బలరామరామడు (47)గా అధికారులు గుర్తించారు. ఇదే ప్రమాదంలో భారత సంతతికి చెందిన న్యూజిలాండ్ వాసి శైలేష్ క్రిష్ణా పటేల్ (49) తీవ్రంగా గాయపడగా, ఆయన్ను, ఎయిర్ డైనాస్టీ పైలట్‌ను అత్యవసర వైద్యం కోసం రాజధాని కాఠ్‌మాండులోని మెడిసిటీ ఆసుపత్రికి ఎయిర్‌లిఫ్ట్ చేశారు. పర్వత ప్రాంతమైన నేపాల్‌లో పర్యాటకం, పర్వతారోహణ, అత్యవసర వైద్య రవాణా కోసం చిన్న హెలికాప్టర్ల వినియోగం అత్యధికంగా ఉంటుంది. అయితే వేగంగా మారే ప్రతికూల వాతావరణ పరిస్థితులు, సంక్లిష్టమైన భౌగోళిక వ్యూహాల కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల భారత భూభాగంలోని ఉత్తరాఖండ్‌లో చమోలీ సమీపంలోనూ బద్రీనాథ్ నుంచి దేహ్రాదూన్ వెళ్తున్న హెలికాప్టర్ కూలి పైలట్ సహా ఆరుగురు మరణించిన సంగతి తెలిసిందే. కాగా, సోలుఖుంబు ఘటనపై నేపాల్ సివిల్ ఏవియేషన్ అథారిటీ సమగ్ర విచారణకు ఆదేశించింది.

నిరసన హక్కు ఉంది..
ఇతరుల హక్కులనూ గౌరవించాలి!

- ఆందోళనల పేరుతో బహిరంగ ప్రదేశాలను నిరవధికంగా ఆక్రమించలేరు
- ఢిల్లీ వ్యాపార సంఘాల పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- నిరసన నిర్వాహకులను ప్రతివాదులుగా చేర్చాలని న్యాయస్థానం ఆదేశం
- కేంద్రంతోపాటు సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ

న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమయం న్యూస్): ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, అయితే ఆ హక్కు పేరుతో ఇతరుల హక్కులకు భంగం కలిగించరాదని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలో సుదీర్ఘంగా కొనసాగుతున్న ఆందోళనల కారణంగా వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని వ్యాపార సంఘాలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రాథమిక హక్కుల పేరుతో నిరసన ప్రాంతాలను నిరవధికంగా ఆక్రమించుకోవడం సమంజసం కాదని అభిప్రాయపడింది. సమాజంలో ఇతర వర్గాల ప్రజలకు కూడా తమ సమస్యలపై గళమెత్తే హక్కు ఉంటుందని గుర్తించాలని సూచించింది. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వంతోపాటు సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ చేసింది. ఢిల్లీలో కొనసాగుతున్న ఆందోళనల కారణంగా వ్యాపార కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని వ్యాపార సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ముఖ్యంగా పండుగల సీజన్‌లో కన్నాట్ ప్లేస్ వంటి ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో నిరసనల వల్ల వ్యాపారాలు దెబ్బతిన్నాయని పిటిషన్‌లో పేర్కొన్నాయి. రహదారులపై ఆందోళనలు, రాకపోకలకు అంతరాయాల కారణంగా వ్యాపారులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించాయి. దాదాపు 50 లక్షల మంది ప్రజలపై ఈ పరిస్థితుల ప్రభావం పడుతోందని వ్యాపార సంఘాలు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లాయి. తమ సమస్యలను పరిగణనలోకి తీసుకుని తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరాయి. పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు నిరసనలు నిర్వహిస్తున్న వారిని కూడా ప్రతివాదులుగా చేర్చాలని ఆదేశించింది. ఆందోళన నిర్వాహకులను పిటిషన్‌లో భాగస్వాములను చేయకుండా వారి హక్కులను ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. అందువల్ల నిరసనకారులు, ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న వారి పేర్లను ప్రతివాదుల జాబితాలో చేర్చాలని పిటిషనర్లకు సూచించింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాతే తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే స్వేచ్ఛకు రాజ్యాంగపరమైన ప్రాధాన్యం ఉందని, అదే సమయంలో ఇతరుల జీవనోపాధి, రాకపోకలు, సాధారణ కార్యకలాపాలకు సంబంధించిన హక్కులను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఒక వర్గం తమ హక్కులను వినియోగించుకునే క్రమంలో మరో వర్గం ప్రజలు నిరంతరం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు తలెత్తకూడదన్న అంశాన్ని ప్రస్తావించింది. నిరసనల నిర్వహణలో ప్రజల సౌకర్యాలు, శాంతిభద్రతలు, వ్యాపార కార్యకలాపాల మధ్య సమతుల్యత అవసరమని అభిప్రాయపడింది. మరోవైపు ఢిల్లీలో నిరసనల సందర్భంగా పెద్దఎత్తున వృక్షాలను అదుపులోకి తీసుకోవడం, పోలీసుల బలప్రయోగం, మెట్రో స్టేషన్ల మూసివేత, అంతర్జాల సేవల నిలిపివేత వంటి అంశాలపై దాఖలైన పిటిషన్లను కూడా సుప్రీంకోర్టు విచారించింది. నిరసనల సందర్భంగా తీసుకునే భద్రతా చర్యలు, వాటి ప్రభావంపై న్యాయస్థానం దృష్టి సారించింది. ఈ వ్యవహారాల్లో సంబంధిత పక్షాల వాదనలు, ప్రభుత్వ వివరణలు కీలకం కానున్నాయి.



దీపావళి వెలుగుల్లోనైనా.. పదవుల గ్రహణం వీడేనా?

ఇటీవల సీఈసీ వ్యవహారంపై రాహుల్ గాంధీ నాయకత్వంలో నిర్వహించిన 'ఛలో ఢిల్లీ' కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రవాణా పరమైన సవాళ్లు ఎదురైనా శ్రేణులను ఢిల్లీకి సమీకరించడంలో నాయకత్వం చూపిన చొరవ పార్టీ సంస్థాగత శక్తిని మరోసారి చర్చకు తెచ్చింది. ఈ కార్యక్రమంతో శ్రేణుల్లో ఉత్సాహం కనిపించినా, నామినేటెడ్ పదవుల విషయంలో మాత్రం నిరీక్షణ కొనసాగుతోంది. సంక్రాంతి, ఉగాది, దసరా గడిచాయి. ఇప్పుడు దీపావళి వచ్చింది. పండుగలు మారుతున్నా పదవులపై ఆశావహుల ఎదురుచూపులు మాత్రం ముగియడం లేదు. ప్రతి పండుగకు ముందు ప్రకటనపై ఆశలు పెరిగి, చివరకు స్పష్టత రాకపోవడం వెనుక రాజకీయ లెక్కలేమిటి? పేర్లు ఖరారయ్యాయా? అధిష్ఠానం ఆమోదం కోసమే జాప్యమా? లేక సామాజిక, ప్రాంతీయ సమీకరణాలే నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయా? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం లేదు. అక్టోబర్ 10న వెలువడిన సమాచారం ప్రకారం, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ల ఎంపిక పూర్తిచేసి పేర్లను అధిష్ఠానానికి పంపినట్లు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. దీపావళికి ముందు లేదా తర్వాత ప్రకటన రావచ్చన్న సంకేతంతో పార్టీ శ్రేణుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ప్రభుత్వ నామినేటెడ్ పదవులతోపాటు పార్టీ సంస్థాగత నియామకాలపైనా నిర్ణయాలు వెలువడాల్సి ఉండటంతో నాయకత్వం తదుపరి అడుగులపై ఆసక్తి నెలకొంది.



కార్పొరేషన్లు, సహకార సంస్థలు, మార్కెట్ కమిటీలు, సంక్షేమ సంస్థల్లో చైర్మన్లు, డైరెక్టర్లు, సభ్యుల నియామకాల కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. అక్టోబర్ 22న వెలువడిన నివేదిక ప్రకారం, సుమారు 50 కొత్త నియామకాలతోపాటు పదవీకాలం ముగిసిన మరో 30కి పైగా స్థానాలు కలిపి దాదాపు 80 పోస్టుల భర్తీపై కసరత్తు జరుగుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గతంలో ప్రచారంలోకి వచ్చిన 87 పోస్టుల అంచనాతో ఈ సంఖ్య సరిపోకపోవడంతో అసలు ఖాళీలపై స్పష్టత అవసరమైంది. ఆర్టీసీ, పౌర సరఫరాలు, మూసీ రివర్‌ఫ్రంట్, పారిశ్రామికాభివృద్ధి, పర్యాటకం, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు చెందిన సంస్థల్లో నియామకాలపై ఆసక్తి నెలకొంది. పదవీకాలం ముగిసిన సుమారు 37 మంది కార్పొరేషన్ చైర్మన్ల స్థానాల భర్తీపైనా నివేదికల్లో ప్రస్తావన వచ్చింది. అయితే ఈ సంఖ్యలను అధికారికంగా ప్రకటించిన తుది ఖాళీలుగా భావించరాదు. కొందరు గతంలో నిర్వహించిన పదవులను కొనసాగించాలని ఆశిస్తుండగా, మరికొందరు తొలిసారి అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. అక్టోబర్ 14న దసరా నాటికి నియామకాలు చేపట్టే అవకాశంపై సంకేతాలు వెలువడగా, అక్టోబర్ 18న వీలైనంత త్వరగా భర్తీ చేస్తామని, దసరాకు ముందే ప్రకటన ఉండకపోవచ్చని నాయకత్వం తెలిపినట్లు నివేదికలు పేర్కొన్నాయి. గడువుపై భిన్నమైన సంకేతాలు రావడంతో ఆశావహుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రచారంలో ఉన్న అంచనాల కంటే ఖాళీల వివరాలు, ఎంపిక ప్రమాణాలు, నియామకాల గడువును వెల్లడించడం ముఖ్యం.

పాత అనుభవం.. కొత్త రాజకీయ బలం.. సమతుల్యత ఎలా?

పదవుల పంపిణీ కాంగ్రెస్ నాయకత్వానికి కీలక పరీక్షగా మారింది. ప్రతిపక్షంలో పదేళ్లపాటు పార్టీ కోసం పనిచేసిన నాయకులు, ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయిలో శ్రమించిన కార్యకర్తలు తమ సేవలకు గుర్తింపు లభిస్తుందని ఆశిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు కూడా తమ రాజకీయ అనుభవం, ప్రజాబలం ఆధారంగా బాధ్యతలు కోరుతున్నారు. దీర్ఘకాలంగా పార్టీకి అండగా నిలిచినవారికి ప్రాధాన్యమిస్తూనే కొత్తగా చేరినవారికి అవకాశాలు కల్పించడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వడం నాయకత్వం ముందున్న సవాలు. ఆగస్టు 23న నిజామాబాద్‌లో పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసినవారికి 70 శాతం నామినేటెడ్ పదవులు కేటాయిస్తామని, కొత్తగా వచ్చినవారికీ ప్రాతినిధ్యం ఉంటుందని మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఆగస్టు 24న కూడా పార్టీ కోసం నిరంతరం శ్రమించినవారికి ప్రాధాన్యం ఇవ్వాలని, గత మూడేళ్లలో అందరికీ తగిన అవకాశాలు లభించలేదన్న అసంతృప్తిని ఆయన ప్రస్తావించినట్లు సమాచారం. ప్రకటనల్లో వ్యక్తమైన ప్రాధాన్యం ఎంపికల్లోనూ ప్రతిబింబించాలి. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతోపాటు జిల్లా, నియోజకవర్గ కమిటీల నియామకాలు పూర్తికాకపోవడం పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని తెలియజేస్తోంది. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవుల కోసం ఎదురుచూస్తున్న కొందరు నేతలు ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవులపైనా ఆశలు పెట్టుకున్నట్లు నివేదికల్లో ప్రస్తావన వచ్చింది. ఒకే బాధ్యత కోసం పలువురు పోటీపడుతున్న వేళ పార్టీ సేవలు, రాజకీయ అనుభవం, సామాజిక ప్రాతినిధ్యం, ప్రాంతీయ సమతుల్యతకు ఏ ప్రాతిపదికన ప్రాధాన్యం ఇస్తారన్నది కీలకం.

కేడర్ ఆశలకు వెలుగునివ్వడం నాయకత్వ బాధ్యత!

నామినేటెడ్ పదవులు కేవలం హోదాలు కావు. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయం పెంచడం, ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడం, సంక్షేమ పథకాల అమలులో భాగస్వాములు కావడం వంటి బాధ్యతలు వాటితో ముడిపడి ఉంటాయి. నియామకాల జాప్యం కొనసాగితే ఆశావహుల నిరీక్షణతోపాటు క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తల ఉత్సాహంపైనా ప్రభావం పడవచ్చు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో పార్టీ సంస్థాగత బలోపేతానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పీసీసీ కార్యవర్గ విస్తరణ, జిల్లాఉ నియోజకవర్గ కమిటీల ఏర్పాటు, కార్పొరేషన్ పదవుల భర్తీని సమన్వయంతో పూర్తిచేస్తే శ్రేణులకు స్పష్టమైన సందేశం అందుతుంది. అర్హత, పార్టీ సేవలు, సామాజిక ప్రాతినిధ్యం, ప్రాంతీయ సమతుల్యత ఆధారంగా ఎంపికలు చేపట్టి నిర్దిష్ట గడువును ప్రకటించాలి. దీపావళికి ముందు లేదా తర్వాత ప్రకటన వస్తుందన్న సంకేతాలు కార్యరూపం దాలుస్తాయా? మూడేళ్లుగా ఎదురుచూస్తున్న నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు దక్కుతుందా? బాధ్యతలు చేపట్టేవారు ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతవరకు కృషి చేస్తారన్నది కూడా ఎంపికలతోపాటే తేలాలి. ఎన్నికల సమయంలో కార్యకర్తల శ్రమతో అధికారాన్ని అందుకున్న పార్టీ, పాలనలోనూ వారి భాగస్వామ్యానికి తగిన విలువ ఇవ్వాలి.

ఫిరోజ్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
ఫోన్: 9640466464





డిస్నీలో భారీగా కొలువుల కోత!

వార్షిక ఖర్చుల్లో 20 శాతం మేర తగ్గింపే లక్ష్యం

టెలివిజన్ ఆదాయం పడిపోవడమే ప్రధాన కారణం

వినోద కేంద్రాలు, చలనచిత్ర నిర్మాణ సంస్థలపైనా ప్రభావం

పాదుపు నిధులను సరికొత్త ప్రణాళికల్లోకి మళ్లించే యోచన

న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమయం న్యూస్) : ప్రపంచ వినోద రంగ దిగ్గజం డిస్నీ సంస్థ భారీ వ్యయ నియంత్రణ చర్యలకు సిద్ధమవుతోంది. వార్షిక ఖర్చుల్లో 20 శాతం మేర పొదుపు చేయాలనే లక్ష్యంతో వేలాది ఉద్యోగాలను తగ్గించడంతో పాటు ఇతర నిర్వహణ వ్యయాలపైనా కోత విధించాలని యోచిస్తోంది. సంప్రదాయ టెలివిజన్ విభాగం ఆదాయం తీవ్రంగా క్షీణించడం, అంతర్జాల వీక్షణ వేదికల చందాదారుల పెరుగుదల నెమ్మదించడం ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. ఓ అంతర్జాతీయ వాణిజ్య పత్రిక నివేదిక ప్రకారం.. ఈ చర్యల ప్రభావం డిస్నీ వినోద కేంద్రాలు, టీవీ ఛానళ్లు, చలనచిత్ర నిర్మాణ సంస్థలపై పడే అవకాశముంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు రెండు లక్షల ముప్పై వేల మందికి పైగా ఉద్యోగులున్న డిస్నీ.. గతంలోనూ ఏబీసీ, పిక్సార్, ఈఎస్‌పీఎన్ సహా పలు విభాగాల్లో వేలాది మందిని తొలగించింది.

నిధుల మళ్లింపు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడిదారులకు ఒక్కో వాటాపై లభించే సర్దుబాటు ఆదాయంలో రెండంకెల వృద్ధి సాధిస్తామని సంస్థ హామీ ఇచ్చింది. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఖర్చుల తగ్గింపు ద్వారా సమకూరే నిధుల్లో కొంత మొత్తాన్ని సినిమాలు, టీవీ కార్యక్రమాలు, సరికొత్త సాంకేతికత, వినోద ఉద్యానవనాలు, విలాసవంతమైన నౌకా వ్యాపారాల అభివృద్ధికి మళ్లించాలని సంస్థ ముఖ్య కార్యనిర్వాహక అధికారి జోష్ డిఅమారో భావిస్తున్నారు. ఉద్యోగాల కోతపై స్పందించేందుకు డిస్నీ ప్రతినిధులు నిరాకరించినప్పటికీ.. సంస్థలో అంతర్గత పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ వేగం పుంజుకున్నట్లు సమాచారం.

వినోద రంగంపై తీవ్ర ఒత్తిడి..

డిస్నీతో పాటు నెట్‌ఫ్లిక్స్, సోనీ పిక్చర్స్, పారామౌంట్, వార్నర్ బ్రదర్స్ లాంటి సంస్థలూ మార్కెట్ ఒత్తిడిని తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి. సంప్రదాయ టెలివిజన్ ఆదాయం పడిపోతుండగా.. సామాజిక మాధ్యమాల వేదికలు, అమెజాన్, యాపిల్ లాంటి సాంకేతిక దిగ్గజాల నుంచి అంతర్జాల రంగంలో పోటీ విపరీతంగా పెరుగుతోంది. దీంతో వినోద సంస్థలు నిర్వహణ వ్యయాలను కట్టడి చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. మారుతున్న సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా వ్యాపార విస్తృతి, నిర్వహణ వ్యవస్థలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని డిస్నీ వర్గాలు భావిస్తున్నాయి. ఉద్యోగాల కోత, ఇతర ఖర్చుల తగ్గింపు ద్వారా లాభాలను మెరుగుపరుచుకుని, కొత్త వ్యాపార విభాగాల్లో విస్తరించాలన్నది ఆ సంస్థ ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.

కడప పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్

- **నిరంతరం పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు**
- **ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రత**

కడప, నవంబర్ 3 (సమయం న్యూస్) : కడప నగర పాలక సంస్థతో పాటు జిల్లాలోని ఆరు పురపాలక సంఘాల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం సరిగ్గా 8 గంటలకు ప్రారంభమైంది. కడప నగర శివార్లలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈ ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. ఈ మొత్తం కౌంటింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల పరిశీలకులు గణేష్ కుమార్, సంయుక్త కలెక్టర్ డాక్టర్ నిధీ మీనా, ఎన్నికల అధికారి, కడప నగర పాలక సంస్థ కమిషనర్ భవానీ ప్రసాద్, పోలీసు ఉన్నతాధికారి భవానీ తదితరులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బంది విధులు, అభ్యర్థుల, వారి ప్రతినిధులకు సంబంధించిన ఏర్పాట్లను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్రాల వద్ద భద్రత ఏర్పాటు చేశారు.



నిరసన తెలిపిన అధికారిపై వేటు!

- **బదిలీలను వ్యతిరేకిస్తూ పోలీసుల తీవ్ర ఆందోళన**
- **150 మంది సిబ్బందితో కలిసి నిరసన ప్రదర్శన**
- **పోలీసు కమిషనర్‌కు ఐదు డిమాండ్లతో వినతిపత్రం**
- **ఏసీపీ మనస్వి వశిష్ఠను విధుల నుంచి తప్పించిన సర్కారు**

న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమయం న్యూస్) : ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం ఎదుట జరిగిన నిరసనకు నాయకత్వం వహించిన ఏసీపీ మనస్వి వశిష్ఠను ఉన్నతాధికారులు అకస్మాత్తుగా విధుల నుంచి తప్పించారు. అక్టోబర్ 23న షాదరా ఠాణాలో న్యాయవాదులు, పోలీసుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటన అనంతరం ఏసీపీ వశిష్ఠతో పాటు మరో పోలీసు అధికారి అరుణ్ కుమార్‌లను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం మహిళా అధికారులతో సహా సుమారు 150 మంది పోలీసులు ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. బదిలీ అయిన ఇద్దరినీ పాత స్థానాల్లోనే కొనసాగించాలని వారు గట్టిగా పట్టుబట్టారు.



కమిషనర్‌కు వినతిపత్రం..

నిరసనకారులు పోలీసు కమిషనర్ అనురాగ్ కుమార్‌ను కలిసి ఐదు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. షాదరా ఘటనలో ప్రమేయం ఉన్న న్యాయవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని, దౌర్జన్యాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయాలని వారు కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్.. పోలీసుల మనోధైర్యం దెబ్బతినకుండా తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ నిరసనకు సంబంధించిన పిలుపు సామాజిక మాధ్యమాల బృందాల ద్వారా వెళ్లినట్లు ఓ జాతీయ వార్తా సంస్థ తెలిపింది.

సమ్మె విరమించిన న్యాయవాదులు..

షాదరా ఠాణాలో జరిగిన ఘటనలో న్యాయవాది లలిత్ బన్సల్ తలకు తీవ్ర గాయాలు కావడంతో న్యాయవాదులు ఆందోళనకు దిగారు. పోలీసుల దురుసు ప్రవర్తనను నిరసిస్తూ జిల్లా న్యాయస్థానాల న్యాయవాదుల సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. అయితే, ఫిర్యాదులు, కేసులపై రెండు నెలల్లో దర్యాప్తు పూర్తి చేస్తామని ఉన్నతాధికారులు హామీ ఇవ్వడంతో న్యాయవాదులు తమ సమ్మెను విరమించారు.

చీకట్లో వందలాది గ్రామాలు!

మురసు తుపానుతో విద్యుత్ వ్యవస్థకు అపార నష్టం

ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో విరిగిపడిన 2,750 స్తంభాలు

1,367 గ్రామాలకు నిలిచిపోయిన సరఫరా

పునరుద్ధరణ పనుల్లో 1,500 మంది సిబ్బంది

విజయవాడ, నవంబర్ 3 (సమయం న్యూస్) : మురసు తుపాను ధాటికి రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థకు భారీ నష్టం వాటిల్లింది. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో విద్యుత్ మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈదురుగాలుల ప్రభావానికి ఏకంగా 2,750 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీనివల్ల రెండు జిల్లాల పరిధిలోని 1,367 గ్రామాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన చేపట్టిన పనులతో 597 గ్రామాల్లో సరఫరా పునరుద్ధరణ పూర్తయింది. ఇంకా చీకట్లోనే ఉన్న మిగిలిన 770 గ్రామాల్లో పునరుద్ధరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. సుమారు 1,500 మంది సిబ్బంది ఈ పనుల్లో నిరంతరం శ్రమిస్తున్నారు. చిలకలూరిపేట పరిధిలో దెబ్బతిన్న 32 ఉపకేంద్రాల్లో 13 కేంద్రాలను ఇప్పటికే పునరుద్ధరించారు. మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) ఉన్నతాధికారి పి. పుల్లారెడ్డి పునరుద్ధరణ పనులను మరింత వేగవంతం చేయాలని కింది స్థాయి అధికారులను ఆదేశించారు. తుపాను కారణంగా పడిపోయిన విద్యుత్ తీగలు, స్తంభాలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ తాకవద్దని ఆయన సూచించారు. విద్యుత్ సమస్యలకు 1912 ఉచిత సేవకు ఫోన్ చేయాలని కోరారు.

సమృద్ధి కోసం నిజాయితీ!

కేంద్ర చిన్న తరహా పరిశ్రమల శాఖ విజిలెన్స్ వారోత్సవాలు

500 మందికి పైగా అధికారులతో నిజాయితీ ప్రతిజ్ఞ

అవినీతి నిరోధం, పారదర్శకతపై అవగాహన కార్యక్రమాలు

వీధి నాటకాల ద్వారా సందేశం

న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమయం న్యూస్) : కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అవినీతి నిరోధక (విజిలెన్స్) వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1 వరకు ఈ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. "సమృద్ధి కోసం నిజాయితీ" అనే ప్రధాన ఇతివృత్తంతో పలు కార్యక్రమాలు చేపట్టారు. మంత్రిత్వ శాఖ కార్యదర్శి భారత్ ఖేరా ఆధ్వర్యంలో 500 మందికి పైగా ఉన్నతాధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో నిజాయితీగా ఉంటామని లాంఛనంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి ప్రశ్నోత్తరాలు, నినాదాల రచన వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అవినీతి నిరోధం, పారదర్శకత ఆవశ్యకతపై సామాన్య ప్రజలకు సైతం అవగాహన కల్పించేందుకు జాతీయ నాటక పాఠశాల (నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా) బృందం వీధి నాటకాలను అద్భుతంగా ప్రదర్శించింది.

నదులకు సరికొత్త సంజీవని!

పూడిక మట్టితో జాతీయ రహదారుల నిర్మాణం

కేంద్ర రవాణా శాఖ, బీహార్ ప్రభుత్వం మధ్య చారిత్రక ఒప్పందం

వరద ముప్పు తగ్గి, పెరగనున్న ప్రవాహ సామర్థ్యం

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సమక్షంలో సంతకాలు

న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమయం న్యూస్) : నదులు, జలవనరుల్లో పేరుకుపోయిన పూడికను పక్కా శాస్త్రీయ పద్ధతిలో తొలగించి, ఆ మట్టిని జాతీయ రహదారుల నిర్మాణంలో వినియోగించేందుకు కీలక ముందడుగు పడింది. ఈ వినూత్న విధానం కోసం కేంద్ర రహదారి రవాణా శాఖ, బీహార్ ప్రభుత్వం మధ్య చారిత్రక ఒప్పందం కుదిరింది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, బీహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి సమక్షంలో ఈ ఒప్పంద పత్రాలపై ఉన్నతాధికారులు సంతకాలు చేశారు. 'నదీ సంజీవని' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా.. ప్రస్తుతం కొనసాగుతున్న 16 రహదారి ప్రాజెక్టులకు ఏకంగా 243 లక్షల ఘన మీటర్ల పూడిక మట్టిని వినియోగించనున్నారు. భవిష్యత్‌లో చేపట్టే మరో 27 ప్రాజెక్టులకు సైతం 835 లక్షల ఘన మీటర్ల పూడికను వినియోగించనున్నారు. ఈ చారిత్రక చర్యతో నదుల నీటి ప్రవాహ సామర్థ్యం పెరగడంతో పాటు ఎగువ ప్రాంతాల్లో వరద ముప్పు గణనీయంగా తగ్గనుంది. దీనికి తోడు వ్యవసాయ భూమి పరిరక్షణ, రహదారి నిర్మాణ వ్యయం భారీగా తగ్గడం లాంటి బహుళ ప్రయోజనాలు కలగనున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

దుబాయ్ మార్కెట్‌కు అరుణాచల్ కివీ!

ప్రయోగాత్మకంగా 1.5 మెట్రిక్ టన్నుల ఎగుమతి

లులు హైపర్‌మార్కెట్‌లో విక్రయానికి ప్రదర్శన

స్థానిక కివీ రైతులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పనే లక్ష్యం

ఎపెడా ఆధ్వర్యంలో అద్భుత కార్యక్రమం



న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమయం న్యూస్) : ఈశాన్య రాష్ట్రం అరుణాచల్‌ప్రదేశ్‌లో పండే నాణ్యమైన కివీ పండ్లకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. అక్కడి జీరో ప్రాంతం నుంచి 1.5 మెట్రిక్ టన్నుల కివీ పండ్లను దుబాయ్‌కు అధికారులు ప్రయోగాత్మకంగా ఎగుమతి చేశారు. వీటిని స్థానికంగా అత్యంత ఆదరణ ఉన్న లులు హైపర్‌మార్కెట్‌లో విక్రయానికి ఉంచారు. అరుణాచల్ ప్రదేశ్ స్థానిక కివీ రైతులకు అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలు కల్పించడం, వినియోగదారుల స్పందనను అంచనా వేసి భవిష్యత్‌లో ఎగుమతులను భారీగా పెంచడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని అధికారులు వెల్లడించారు. వ్యవసాయ, ప్రాసెస్డ్ ఫుడ్ ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ (ఎపెడా) ఆధ్వర్యంలో ఈ అద్భుతమైన కార్యక్రమాన్ని చేపట్టారు.

వణికిస్తున్న మురసు!

- **15 జిల్లాల్లో 30,661 హెక్టార్లలో పంట నష్టం**
- **కృష్ణా, బాపట్ల, నంద్యాల జిల్లాల్లో అధిక ప్రభావం**
- **సహాయక చర్యల్లో 171 పునరావాస కేంద్రాలు**
- **ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెలిఫోన్ సమీక్ష**

అమరావతి, నవంబర్ 3 (సమయం న్యూస్) : రాష్ట్రంలో మురసు తుపాను తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ తుపాను కారణంగా రాష్ట్రంలోని 15 జిల్లాల పరిధిలో సుమారు 30,661 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. కృష్ణా, బాపట్ల, నంద్యాల జిల్లాల్లో దీని ప్రభావం మరింత అధికంగా ఉండగా.. వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు అపార నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు. మొత్తం 15 జిల్లాల్లోని 132 మండలాల్లో సాధారణ స్థాయి కంటే అధికంగా తుపాను తన ప్రతాపం చూపినట్లు అధికారులు వివరించారు. మార్కాపురం జిల్లా డోర్నాల వద్ద గంటకు 107 కిలోమీటర్ల వేగంతో భీకర ఈదురుగాలులు వీచాయి.

చకచకా సహాయక చర్యలు..

తుపాను ప్రభావిత ప్రాంతాల నుంచి దాదాపు 10,805 మందిని రక్షించి 171 పునరావాస కేంద్రాలకు సురక్షితంగా తరలించారు. బాధితులకు 14,810 ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. సహాయక చర్యల కోసం జాతీయ, రాష్ట్ర విపత్తు నిర్వహణ దళాలకు చెందిన 24 బృందాలను రంగంలోకి దించారు. అత్యవసర విద్యుత్ సరఫరా కోసం 613 జనరేటర్లను సిద్ధంగా ఉంచారు. కూలిన చెట్లు, నిలిచిపోయిన నీటిని తొలగించేందుకు అగ్నిమాపక సిబ్బందిని మోహరించారు. చెట్ల తొలగింపునకు 185 ప్రత్యేక బృందాలు రేయింబవళ్లు శ్రమిస్తున్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా 3,066 మంది గర్భిణులు, 1,008 మంది బాలింతలను సురక్షిత ప్రాంతాల్లోని ఆసుపత్రులకు తరలించారు. 13 జిల్లాల్లో 725 వైద్య బృందాలను మోహరించగా, అత్యవసర సేవల కోసం 362 అంబులెన్సులను సిద్ధంగా ఉంచారు. తుపాను హెచ్చరికలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసేందుకు 3.77 కోట్ల చరవాణులకు నిరంతరం సందేశాలు పంపించారు. అత్యవసర సహాయం కోసం 'మనం మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వాస్తవ సమయ పాలనా విభాగం (ఆర్టీజీఎస్) అధికారులు తెలిపారు.




నిరంతర సమీక్షలో ముఖ్యమంత్రి..

మురసు తుఫాను ప్రభావంపై 12 జిల్లాల కలెక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెలిఫోన్ ద్వారా సమీక్ష నిర్వహించారు. 45 వేల మందికి పైగా అధికారులతో మాట్లాడిన ఆయన.. తుఫాను సమయంలో నిరంతరాయంగా సేవలందిస్తున్న సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రేపటి వరకు యంత్రాంగం అంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద ప్రవాహాలు బాపట్ల జిల్లాకు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. బాధితులకు రేపు సాయంత్రంలోగా అన్ని విధాలా సహాయం అందించాలని కలెక్టర్లను ఆదేశించారు.

ప్రజాధనానికి పక్కా లెక్క ఉండాలి!

- **ప్రతి రూపాయి నిర్దేశిత ప్రయోజనానికే ఖర్చు కావాలి**
- **ప్రజా పద్దుల కమిటీల నిరంతర పర్యవేక్షణ అవసరం**
- **ఆధునిక సాంకేతికతతో అవినీతికి అడ్డుకట్ట**
- **లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక వ్యాఖ్యలు**



తిరువనంతపురం, నవంబర్ 3 (సమయం న్యూస్) : ప్రజాధనంలోని ప్రతి రూపాయిని నిర్దేశిత ప్రయోజనానికే వినియోగించేలా చూడాల్సిన బాధ్యత ఉందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్పష్టం చేశారు. దీనికోసం ప్రజా పద్దుల కమిటీలు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన సూచించారు. ప్రజాధనం వినియోగంలో అత్యంత పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక ఆడిట్ అభ్యంతరాలను ఒక నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించాలని ఉన్నతాధికారులకు సూచించారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగాన్ని కఠినంగా అరికట్టేందుకు కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), డేటా విశ్లేషణ, ఇతర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



టెలికాం నెట్‌వర్క్‌లకు కొత్త నిబంధనలు!

అనుసంధాన ప్రక్రియను ఆధునికీకరించిన ట్రాయ్

2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్న మార్పులు

కొత్త అనుసంధానాలన్నీ ఐపీ ఆధారితంగానే..

మెరుగుపడనున్న కాల్ నాణ్యత, సేవల విశ్వసనీయత

న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమయం న్యూస్) : దేశంలో టెలికాం నెట్‌వర్క్‌ల అనుసంధాన ప్రక్రియను పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు టెలికాం నియంత్రణ ప్రాధికార సంస్థ (ట్రాయ్) కొత్త సవరణ నిబంధనలను విడుదల చేసింది. ఈ నూతన మార్గదర్శకాలు 2027 జనవరి 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తాయి. తాజా నిబంధనల ప్రకారం.. కొత్తగా ఏర్పాటయ్యే అనుసంధానాలన్నీ తప్పనిసరిగా ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) ఆధారితంగానే ఉండాలి. ప్రస్తుతం ఉన్న పాత అనుసంధానాలను మూడేళ్లలో దశలవారీగా ఈ సరికొత్త ఐపీ విధానంలోకి మార్చాల్సి ఉంటుంది. టెలికాం ట్రాఫిక్‌ను సర్వీస్ ఏరియా స్థాయికి మార్చడం, బకాయిలపై ఆలస్య చెల్లింపులకు వడ్డీ వసూలు, నిబంధనల ఉల్లంఘనకు ఆర్థిక జరిమానాలు విధించడం లాంటి కీలక మార్పులను ఈ నూతన నిబంధనల్లో చేర్చారు. ఈ విప్లవాత్మక మార్పులతో భవిష్యత్తులో మొబైల్ కాల్ నాణ్యత, సేవల విశ్వసనీయత, టెలికాం నెట్‌వర్క్‌ల మధ్య కమ్యూనికేషన్ మరింత అద్భుతంగా మెరుగుపడనుందని సాంకేతిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఇంటి నుంచే జీవన ప్రమాణ పత్రం!

పెన్షనర్లందరికీ డిజిటల్ సర్టిఫికెట్ అందేలా చర్యలు

80 ఏళ్లు పైబడిన 14 లక్షల మందికి సేవలు

న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమయం న్యూస్): దేశవ్యాప్తంగా ఉన్న పెన్షనర్లందరికీ ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ జీవన ప్రమాణ పత్రం (లైఫ్ సర్టిఫికెట్) అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని కేంద్ర పెన్షన్ శాఖ సంబంధిత అధికారులకు పిలుపునిచ్చింది. వయోవృద్ధులు బ్యాంకుల చుట్టూ తిరిగే బాధ లేకుండా ముఖ గుర్తింపు సాంకేతికతతో ఇంటి నుంచే స్మార్ట్‌ఫోన్ ద్వారా ఈ సర్టిఫికెట్‌ను సులువుగా సమర్పించుకోవచ్చని కేంద్రం తెలిపింది. గతంలో నిర్వహించిన ప్రత్యేక ప్రచారంలో 80 ఏళ్లు పైబడిన 14 లక్షల మందికి పైగా పెన్షనర్లు ఆన్‌లైన్ విధానంలో తమ జీవన ప్రమాణ పత్రాలను విజయవంతంగా సమర్పించారని వెల్లడించింది. సాంకేతికతను వినియోగించలేని వారి కోసం బ్యాంకులు, తపాలా కార్యాలయాల ద్వారా ఇంటి వద్దకే వెళ్లి సేవలు అందించే సదుపాయం కూడా అందుబాటులో ఉందని అధికారులు ఈ సందర్భంగా వివరించారు.

స్థానిక తీర్పు.. సుపరిపాలనకు నిదర్శనం!

పురపాలక ఎన్నికల్లో కూటమి విజయంపై బీజేపీ హర్షం

ప్రజలు అందించిన విజయాన్ని వినయంగా స్వీకరిస్తున్నాం

ముగ్గురు అగ్రనేతల సమర్థ పాలనకే ఈ పట్టం

బీజేపీ జాతీయ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి వ్యాఖ్యలు

కదిరి, నవంబర్ 3 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్ పురపాలక ఎన్నికల్లో కూటమికి రాష్ట్ర ప్రజలు అందించిన ఘన విజయాన్ని అత్యంత వినయంగా స్వీకరిస్తున్నామని భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో సాగుతున్న సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన అద్భుతమైన తీర్పే ఈ విజయమని ఆయన విశ్లేషించారు. అఖండ విజయం సాధించిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ అభ్యర్థులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. కూటమి విజయానికి నిరంతరం శ్రమించిన మూడు పార్టీల నాయకులు, కిందిస్థాయి కార్యకర్తలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి సహకారం మరింత పెరుగుతుందని, అది రాష్ట్ర అభివృద్ధికి గొప్ప ఊతమిస్తుందని విష్ణువర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.



59 వేల మందికి చేరిన ప్రచారం!

ఉధృతంగా 'వికసిత భారత్ యువ సంవాద్'

దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 311 కార్యక్రమాలు

30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అవగాహన

ఓటు హక్కు ప్రజాస్వామ్య విలువలపై విస్తృత ప్రచారం

న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమయం న్యూస్) : దేశవ్యాప్తంగా యువతలో చైతన్యం తెచ్చేందుకు చేపట్టిన 'వికసిత భారత్ యువ సంవాద్ – నీ ఓటు గురించి తెలుసుకో' ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఈ ప్రచారంలో భాగంగా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఏకంగా 311 కార్యక్రమాలు నిర్వహించారు. మొత్తం 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో సుమారు 59,408 మంది యువతను ఈ చైతన్య కార్యక్రమాల్లో భాగస్వాములను చేశారు. మంగళవారం ఒక్కరోజే 24 రాష్ట్రాల్లో 91 కార్యక్రమాలు నిర్వహించి 15,453 మంది యువతకు ఓటు హక్కు ప్రాముఖ్యత, ప్రజాస్వామ్య విలువలు, పౌర బాధ్యతలపై విశేషంగా అవగాహన కల్పించారు. నేటి యువత సమాజంలోని వాస్తవాలను క్షుణ్ణంగా తెలుసుకుని ఎంతో బాధ్యతాయుతంగా ఓటు వేయాలని ప్రజాప్రతినిధులు, మేధావులు ఈ సందర్భంగా వారికి సూచించారు.

కివీస్‌తో వన్డే సమరం.. నేడే తొలి పోరు!

- టీ20 సిరీస్ విజయంతో జోరుమీదున్న టీమిండియా
- ఆక్లాండ్ ఈడెన్ పార్క్‌లో భారత్-న్యూజిలాండ్ ఢీ
- జట్టులోకి రోహిత్, కోహ్లీ.. బ్యాటింగ్‌కు అదనపు బలం
- తొలి మూడు వన్డేలకు గిల్.. చివరి రెండింటికి అయ్యర్ సారథ్యం
- ఈడెన్ పార్క్‌లో భారత్‌కు సవాల్ విసురుతున్న గత రికార్డులు



ఆక్లాండ్, నవంబర్ 3 (సమయం న్యూస్): పొట్టి క్రికెట్‌లో న్యూజిలాండ్‌ను ఓడించిన భారత జట్టు ఇప్పుడు వన్డే సమరానికి సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3--2 తేడాతో కైవసం చేసుకున్న టీమిండియా అదే ఉత్సాహంతో వన్డే పోరులో అడుగుపెడుతోంది. భారత్, న్యూజిలాండ్ మధ్య ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ బుధవారం ఆక్లాండ్‌లోని చారిత్రాత్మక ఈడెన్ పార్క్ మైదానంలో జరగనుంది. టీ20ల్లో సాధించిన విజయాన్ని వన్డేల్లోనూ కొనసాగించాలని భారత జట్టు భావిస్తుండగా, సొంతగడ్డపై సిరీస్‌కు శుభారంభం ఇవ్వాలని న్యూజిలాండ్ పట్టుదలతో ఉంది. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తిరిగి జట్టులోకి రావడంతో భారత బ్యాటింగ్ విభాగం మరింత బలపడింది. ఈ వన్డే సిరీస్‌లో భారత జట్టుకు ఇద్దరు కెప్టెన్లు వ్యవహరించనుండటం ప్రత్యేకతగా నిలుస్తోంది. తొలి మూడు వన్డేలకు యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహించనుండగా, చివరి రెండు మ్యాచ్‌లకు శ్రేయస్ అయ్యర్ సారథ్య బాధ్యతలు చేపట్టనున్నారు. యువ ఆటగాళ్లతోపాటు అనుభవజ్ఞులైన క్రికెటర్లు జట్టులో ఉండటంతో భారత్ సమతూకంగా కనిపిస్తోంది. ముఖ్యంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రాకతో బ్యాటింగ్ విభాగంపై అంచనాలు పెరిగాయి. ఆరంభంలో రోహిత్ దూకుడుగా ఆడితే, మధ్య ఓవర్లలో కోహ్లీ ఇన్నింగ్స్‌ను నిలబెట్టే అవకాశం ఉంటుంది. వీరిద్దరి అనుభవం న్యూజిలాండ్ పరిస్థితుల్లో భారత్‌కు కీలకం కానుంది. ఈ సిరీస్‌లో రోహిత్ శర్మ ప్రదర్శనపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. అంతర్జాతీయ క్రికెట్‌లో భారీ సిక్సర్లు బాదడంలో ప్రత్యేక గుర్తింపు పొందిన రోహిత్ మరో మైలురాయికి చేరువలో ఉన్నాడు. న్యూజిలాండ్ గడ్డపై సెంచరీ సాధిస్తే వయసు పరంగా అరుదైన ఘనత అందుకునే అవకాశమూ ఉంది. అయితే వ్యక్తిగత రికార్డులకంటే జట్టు విజయమే ముఖ్యమని భారత అభిమానులు ఆశిస్తున్నారు. మరోవైపు విరాట్ కోహ్లీ కూడా తన అనుభవంతో కీలక ఇన్నింగ్స్ ఆడాలని భావిస్తున్నాడు. తొలి మ్యాచ్‌కు వేదికైన ఈడెన్ పార్క్ మైదానంలో భారత్ గత రికార్డులు అంత ఆశాజనకంగా లేవు. ఇక్కడ ఇప్పటివరకు ఆడిన 11 వన్డేల్లో భారత్ నాలుగింట మాత్రమే విజయం సాధించగా, ఆరు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసింది. మరో మ్యాచ్ టైగా ముగిసింది. ఈ నేపథ్యంలో పాత రికార్డులను అధిగమించి విజయంతో సిరీస్‌ను ప్రారంభించడం టీమిండియాకు సవాల్‌గా మారనుంది. న్యూజిలాండ్ మైదానాల్లో బంతి కదలిక, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా బ్యాటర్లు తమ ఆటతీరును మార్చుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఆరంభ ఓవర్లలో వికెట్లు కోల్పోకుండా నిలబడటం భారత విజయావకాశాలను ప్రభావితం చేయనుంది. మిచెల్ సాంట్నర్ నాయకత్వంలోని న్యూజిలాండ్ జట్టును తక్కువ అంచనా వేయలేము. సొంత మైదానాలపై మంచి అవగాహన కలిగిన కివీస్ ఆటగాళ్లు భారత బ్యాటర్లకు గట్టి సవాల్ విసిరే అవకాశం ఉంది. టీ20 సిరీస్ ఓటమి తర్వాత వన్డేల్లో పుంజుకోవాలని ఆతిథ్య జట్టు భావిస్తోంది. బౌలింగ్‌లో క్రమశిక్షణతోపాటు చురుకైన క్షేత్రరక్షణ న్యూజిలాండ్‌కు ప్రధాన బలాలు. భారత బ్యాటింగ్ విభాగాన్ని త్వరగా కట్టడి చేయడంపైనే ఆ జట్టు దృష్టి సారించనుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి పోరు రెండు జట్లకూ కీలకం కానుంది. ప్రారంభ మ్యాచ్‌లో విజయం సాధిస్తే మిగిలిన పోరులకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమయ్యే అవకాశం ఉంటుంది. భారత్‌కు సీనియర్ ఆటగాళ్ల అనుభవం అండగా ఉండగా, న్యూజిలాండ్‌కు సొంతగడ్డ పరిస్థితులు అనుకూలంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో రెండు జట్ల మధ్య ఆసక్తికర పోరు జరిగే అవకాశముంది. న్యూజిలాండ్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3 గంటలకు, భారత కాలమానం ప్రకారం ఉదయం 7.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఒకవైపు రోహిత్, కోహ్లీ అనుభవం.. మరోవైపు గిల్ యువ నాయకత్వం.. సొంతగడ్డపై సాంట్నర్ సేన సవాల్! తొలి వన్డేలో ఎవరు పైచేయి సాధిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.



పంజాబ్ కింగ్స్ భారీ స్కెచ్

ముంబై నుంచి హార్దిక్ పాండ్యా కోసం ఆ ఇద్దరు ఆటగాళ్ల ట్రేడ్ డీల్!

ముంబై, నవంబర్ 3 (సమయం న్యూస్): ఐపీఎల్ 2027 సీజన్ ప్రారంభానికి ముందే లీగ్‌లో ఓ భారీ సంచలనానికి తెరలేచే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత స్టార్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ ఆటగాడు హార్దిక్ పాండ్యా ఫ్రాంచైజీ మారే దిశగా అడుగులు వేస్తున్నట్లు క్రీడా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2027కి ముందు హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకునేందుకు పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ ముంబై ఇండియన్స్‌తో తీవ్రస్థాయిలో ట్రేడ్ చర్చలు జరుపుతున్నట్లు ప్రముఖ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సంచలన ట్రేడ్ డీల్‌లో భాగంగా హార్దిక్ పాండ్యాను దక్కించుకునేందుకు పంజాబ్ కింగ్స్ తమ స్టార్ ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌తో పాటు యువ వికెట్ కీపర్-బ్యాటర్ విష్ణు వినోద్‌లను ముంబై ఇండియన్స్‌కు ఇచ్చే ప్రతిపాదనను తెరపైకి తెచ్చినట్లు సమాచారం. ముంబై జట్టు బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు పంజాబ్ టాప్ వికెట్ టేకర్ అర్ష్‌దీప్‌ను తీసుకోవడానికి ముంబై మేనేజ్‌మెంట్ కూడా సుముఖంగా ఉన్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. పంజాబ్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ ఈ ట్రేడ్ చర్చలను ముందుకు తీసుకెళ్లడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని, ఇరు జట్ల సీనియర్ మేనేజ్‌మెంట్లు ఈ ఒప్పందానికి దాదాపు అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది. హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టులోకి వస్తే మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్‌తో పాటు డెత్ ఓవర్ల బౌలింగ్‌లో జట్టుకు అపారమైన బలం చేకూరుతుంది. అయితే ప్రధాన బౌలర్ అర్ష్‌దీప్‌ను కోల్పోవడం పంజాబ్ పేస్ విభాగానికి కొంత లోటే అయినప్పటికీ, ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనను సమర్థవంతంగా వాడుకునే వ్యూహంతో పంజాబ్ మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2027 రిటెన్షన్ గడువు నవంబర్ 17 కావడంతో, ఈ డీల్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనను ఐపీఎల్ వర్గాలు ఈ వారంలోనే వెల్లడించే అవకాశాలు ఉన్నాయని నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ వార్తపై ఇరు ఫ్రాంచైజీల నుంచి ఇంకా అధికారిక ధృవీకరణ వెలువడాల్సి ఉంది.

కాలికి గాయమైనా వీరోచిత పోరాటం

- 128 బంతుల్లో అజేయంగా 201 పరుగులు.. 21 ఫోర్లు, 10 సిక్సర్లతో విధ్వంసం
- అఫ్గానిస్థాన్‌పై వాంఖడే మైదానంలో అసాధారణ పోరాటం
- అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు నేపథ్యంలో మళ్లీ చర్చకు వచ్చిన చారిత్రక ద్విశతకం



మెల్‌బోర్న్, నవంబర్ 3 (సమయం న్యూస్) : మైదానంలో తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించిన ఆస్ట్రేలియా స్టార్ ఆల్ రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. 38 ఏళ్ల వయసులో మాక్స్‌వెల్ సంచలన రీతిలో తీసుకున్న ఈ రిటైర్మెంట్ నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. నిజానికి 2028 టీ20 వరల్డ్ కప్, లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో ఆస్ట్రేలియా తరఫున ప్రతినిధ్యం వహించాలని ఆయన భావించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలకాలని నిశ్చయించుకున్నారు. ఈ సందర్భంగా క్రికెట్ ప్రపంచం ఎప్పటికీ మరచిపోలేని ఆయన వీరోచిత ఇన్నింగ్స్ గురించి సోషల్ మీడియాలో క్రీడాభిమానులు ఘనంగా స్మరించుకుంటున్నారు. ముంబైలోని చారిత్రాత్మక వాంఖడే స్టేడియం వేదికగా 2023 వన్డే వరల్డ్ కప్‌లో అఫ్గానిస్తాన్‌తో జరిగిన పోరు వన్డే చరిత్రలోనే అత్యుత్తమ మ్యాచ్‌గా నిలిచింది. ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా కేవలం 91 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి ఘోర ఓటమి అంచున నిలిచింది. ఆ దశలో క్రీజులోకి వచ్చిన మాక్స్‌వెల్ తీవ్రమైన కండరాల నొప్పులు (క్రాంప్స్), కాలి గాయంతో నడవలేని పరిస్థితి ఏర్పడినప్పటికీ మైదానంలో పట్టుదలతో నిలబడి అఫ్గాన్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. కేవలం 128 బంతుల్లోనే 21 ఫోర్లు, 10 సిక్సర్లతో 201 పరుగులు చేసి అజేయంగా నిలిచి ఆసీస్‌కు 3 వికెట్ల తేడాతో విస్మయకర విజయాన్ని అందించారు. ఈ చారిత్రాత్మక ఇన్నింగ్స్ తోడ్పాటుతోనే ఆస్ట్రేలియా ఆ ఏడాది వరల్డ్ కప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. గ్లెన్ మాక్స్‌వెల్ అంతర్జాతీయ క్రికెట్‌లోని 3 ఫార్మాట్లలోనూ తనదైన ముద్ర వేశారు. టెస్టుల్లో 7 మ్యాచ్‌లు ఆడి ఒక సెంచరీతో 339 పరుగులు చేయగా, 8 వికెట్లు పడగొట్టారు. ఇక 149 వన్డేల్లో 126.70 స్ట్రైక్ రేట్‌తో 4 సెంచరీలు, 23 హాఫ్ సెంచరీలతో 3990 పరుగులు సాధించడంతో పాటు 77 వికెట్లు తీశారు. 2015, 2023 వన్డే వరల్డ్ కప్‌లు గెలిచిన ఆసీస్ జట్టులో ఆయన అత్యంత కీలక పాత్ర పోషించారు. 130 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 154.42 స్ట్రైక్ రేట్‌తో 5 సెంచరీలు, 12 హాఫ్ సెంచరీల సాయంతో 2897 పరుగులు చేయడంతో పాటు 51 వికెట్లు తీశారు. అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెప్పినప్పటికీ వివిధ దేశాల ఫ్రాంచైజీ లీగ్ క్రికెట్‌లో ఆయన కొనసాగుతారా లేదా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.



డయానా గ్రేస్‌కు 3 పతకాలు

హైదరాబాద్: సీబీఎస్ఈ జాతీయ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ జిమ్నాస్ట్ డయానా గ్రేస్ అద్భుత ప్రదర్శనతో ఒక స్వర్ణం, రెండు కాంస్య పతకాలను సాధించింది. పుణెలో జరిగిన ఈ టోర్నీ అండర్-19 విభాగంలో పోటీపడిన డయానా (కార్నర్‌స్టోన్ స్కూల్) ఇండివిజువల్ ఆపరేటస్ బీమ్ ఈవెంట్‌లో 9.45 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకం సొంతం చేసుకుంది. అన్‌ఈవెన్ బార్ (7.25), ఆల్‌రౌండ్ (34.05) విభాగాల్లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాలను ఖాతాలో వేసుకుంది.

కొరియా ఓపెన్‌కు లక్ష్యసేన్ దూరం



యోసు (సౌత్ కొరియా): రెండ్రోజుల క్రితం ముగిసిన హైలో ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో మెన్స్ సింగిల్స్ టైటిల్ గెలుచుకున్న భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్.. మంగళవారం నుంచి దక్షిణ కొరియాలో మొదలుకానున్న బీడబ్ల్యూఎఫ్ కొరియా సూపర్ 500 టోర్నమెంట్‌కు దూరమయ్యాడు. ఐదో సీడ్‌గా ఉన్న అతడు తప్పుకోవడంతో ఈ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో భారత ఆశలన్నీ సీనియర్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ పై ఉన్నాయి. తొలిరౌండ్‌లో అతడు లోకల్ ప్లేయర్ యొ టెబిన్‌తో తలపడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక కూడా టోర్నీకి దూరమైంది. అన్మోల్ ఖర్బ్, తన్వి శర్మ విమెన్స్ సింగిల్స్ బరిలో ఉన్నారు. కొరియా ఓపెన్‌తో పాటు జపాన్ మాస్టర్స్ నుంచి సింధు ముందే తప్పుకుంది.

అజేయంగా సెమీస్‌కు..

భారత్ ఖాతాలో ఐదో విజయం



జలంధర్: సొంతగడ్డపై జరుగుతున్న హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో ఓటమన్నదే లేకుండా ఆడుతున్న భారత జట్టు ఖాతాలో మరో విజయం. లీగ్ దశలో భాగంగా సోమవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్.. 8-0తో దక్షిణ కొరియాను చిత్తుచేసి అజేయంగా సెమీస్‌కు చేరుకుంది. గ్రూప్ దశలో మొదట బంగ్లాదేశ్‌పై 13-0తో టైటిల్ వేటను ఆరంభించిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేన ఆ తర్వాత చైనా, జపాన్, మలేషియాపై విజయాలు నమోదుచేసింది. కొరియాతో పోరులో స్ట్రైకర్ దిల్‌ప్రీత్ సింగ్ (8, 40వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా జుగ్‌రాజ్ సింగ్ (11), హర్మన్‌ప్రీత్‌సింగ్ (15), షీలానంద్ (33), సుఖ్‌జీత్ (34), సంజయ్ (36), అంగద్ (60) చెరో గోల్స్‌తో చెలరేగారు. లీగ్ స్టేజ్‌లో ఆడిన ఐదు మ్యాచుల్లోనూ గెలిచిన భారత్.. పాయింట్ల పట్టికలో 15 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. బుధవారం జరుగబోయే రెండో సెమీ-స్‌లో కొ రియాతోనే భారత్ నాకౌట్ మ్యాచ్ ఆడనుంది.



'రామాయణ'కు పైరసీ భయం

కీలక ఆదేశాలు జారీ చేసిన ముంబై హైకోర్టు!

ముంబై, నవంబర్ 3 (సమయం న్యూస్): భారతీయ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రం 'రామాయణ'. బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్న ఈ చిత్రానికి నితీశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. అత్యంత భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో రూపొందుతున్న ఈ సినిమాను రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. తొలి భాగాన్ని దీపావళి కానుకగా విడుదల చేసేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన దృశ్యాలు, వీడియో క్లిప్పులు బయటకు రాకుండా నిర్మాతలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న సినిమాలకు పైరసీ పెద్ద సమస్యగా మారుతోంది. థియేటర్లలో విడుదలకు ముందే సినిమా దృశ్యాలు, పాటలు, కీలక సన్నివేశాలు సామాజిక మాధ్యమాల్లో లీక్ అయితే చిత్ర బృందానికి నష్టం కలిగే అవకాశం ఉంటుంది. ఈ సమస్యను ముందుగానే అడ్డుకునేందుకు 'రామాయణ' నిర్మాతలు న్యాయపరమైన చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ముంబై హైకోర్టు సినిమా పైరసీ, అనధికారిక వీడియో క్లిప్పుల ప్రచారాన్ని అడ్డుకునేందుకు ప్రత్యేకంగా డైనమిక్ ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. సినిమా పేరుతో అనధికారికంగా లింకులు, వీడియోలు, క్లిప్పులు అప్‌లోడ్ చేసే వెబ్‌సైట్లు, ఇతర వేదికలపై చర్యలు తీసుకునేందుకు ఈ ఉత్తర్వులు ఉపయోగపడనున్నాయి. డిసెంబర్ మధ్య వరకు 'రామాయణ'కు సంబంధించిన పైరసీ లింకులు, అనధికారిక కంటెంట్ వ్యాప్తిని నియంత్రించేందుకు ఈ ఆదేశాలు తోడ్పడనున్నాయి. భారీ పెట్టుబడితో రూపొందుతున్న సినిమాను పైరసీ నుంచి రక్షించుకోవడంలో నిర్మాతలు తీసుకున్న ఈ చర్యకు ప్రాధాన్యత ఏర్పడింది. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రామాయణ'లో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా కనిపించనున్నారు. కన్నడ స్టార్ యష్ రావణుడి పాత్ర పోషిస్తున్నారు. ఈ ముగ్గురు ప్రముఖ నటులు ఒకే చిత్రంలో భాగం కావడంతో మొదటి నుంచే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్‌తో పాటు ప్రముఖ హాలీవుడ్ సంగీత దర్శకుడు హన్స్ జిమ్మర్ సంగీతం అందిస్తున్నారు. భారతీయ పురాణ గాథను ప్రపంచ ప్రేక్షకులకు చేరువ చేసేలా భారీ సాంకేతిక హంగులతో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. నమిత్ మల్హోత్రా నిర్మాణ బాధ్యతలు చేపట్టగా, యష్ కూడా నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నారు..



ఇకపై ఆచితూచి మాట్లాడుతా..

నా మాటల భావనలో లోపాలను సరిదిద్దుకుంటా: నటి సాయిపల్లవి!

హైదరాబాద్, నవంబర్ 3 (సమయం న్యూస్) : తన సహజ నటనతో అశేష ప్రేక్షకాభిమానులను సొంతం చేసుకున్న ప్రముఖ కథానాయిక సాయిపల్లవి తన ప్రసంగాలు, మాటల శైలిపై కీలక ప్రకటన చేశారు. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటూ 'ఫిదా', 'లవ్ స్టోరీ', 'శ్యామ్ సింగరాయ్', 'విరాటపర్వం', 'తండేల్' వంటి చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, గతంలో పలు సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలు వివాదాలకు దారితీసిన విషయం తెలిసిందే. 'విరాటపర్వం' ప్రమోషన్లలో కశ్మీరీ పండిట్ల అంశం, భారత సైన్యంపై చేసిన పాత వ్యాఖ్యలు, అలాగే ఇటీవల 'రామాయణ' చిత్రంలో రావణుడి పాత్రపై ఆమె చేసిన తాత్విక కామెంట్స్ సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన సాయిపల్లవి.. ఇకపై తాను ప్రతి మాటను ఆచితూచి మాట్లాడతానని స్పష్టం చేశారు. తన మనసులో ఉన్న భావాలను ఇతరులకు స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పడంలో తనకు కొంత ఇబ్బంది ఉందని, మాటల రూపంలో సరిగ్గా వ్యక్తపరచలేకపోవడం వల్ల తాను చెప్పాలనుకున్న దానికి భిన్నమైన అర్థాలు వస్తున్నాయని నిజాయితీగా అంగీకరించారు. ఒక నటిగా తనకు లభించే గుర్తింపు కారణంగా ప్రతి మాటకు సమాజంలో పెద్ద ఎత్తున ప్రచారం లభిస్తుందని, అందువల్ల ఇకపై మాట్లాడే విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. తన భావాలను సరిగ్గా వ్యక్తపరిచే నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటానని చెప్పిన ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం ఫిలిం వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

తెల్లగా ఉంటే చాలు.. తెలుగు అక్కర్లేదు

టాలీవుడ్ పరిస్థితిపై రాధికా ఆప్టే సంచలన వ్యాఖ్యలు!



హైదరాబాద్, నవంబర్ 3 (సమయం న్యూస్) : బాలీవుడ్ నటి రాధికా ఆప్టే తెలుగు చలనచిత్ర పరిశ్రమలో హీరోయిన్ల ఎంపిక, కథాంశాల తీరుపై చేసిన సంచలన వ్యాఖ్యలు ప్రస్తుతం టాలీవుడ్‌లో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. తెల్లగా ఉంటే చాలు, తెలుగు భాష రాకపోయినా, భాషతో సంబంధం లేకుండా హీరోయిన్లుగా తీసేసుకుంటారనే కోణంలో టాలీవుడ్ పరిస్థితులపై ఆమె అసహనం వ్యక్తం చేసిన తీరు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. కీర్తి సురేష్‌తో కలిసి నటించిన క్రైమ్ థ్రిల్లర్ వెబ్‌సిరీస్ 'అక్కా' ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె, తన గత తెలుగు సినిమాల అనుభవాలను గుర్తుచేసుకుంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలుగులో తాను నటించిన ఓ సినిమాలో తనకంటే చాలా పెద్ద వయసున్న నటుడితో రొమాన్స్ చేయాల్సి వచ్చిందని, అంతేకాకుండా సొంత మేనబావను పెళ్లి చేసుకునే సన్నివేశాలు ఉన్నాయని చెప్పారు. అంతటితో ఆగకుండా సినిమా మధ్యలోనే తన పాత్రను చంపేశారంటూ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆమె నేరుగా సినిమా పేరును వెల్లడించనప్పటికీ, ఈ వ్యాఖ్యలు నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన 'లెజెండ్' (2014) సినిమాను ఉద్దేశించినవేనని సినీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. ఆ చిత్రంలో రాధికా ఆప్టే బాలకృష్ణకు మరదలి పాత్రలో నటించగా, కథలోని ఫ్లాష్‌బ్యాక్‌లోనే ఆమె పాత్ర హత్యకు గురవుతుంది. ఈ వ్యాఖ్యలు బయటకు రావడంతో సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు, నందమూరి అభిమానులు ఆమెకు ఘాటుగా కౌంటర్లు ఇస్తున్నారు. కథ, పాత్ర స్వభావం నచ్చనప్పుడు సినిమాను అంగీకరించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తున్నారు. అడ్వాన్స్ తీసుకుని సైన్ చేసేటప్పుడే ఇవన్నీ తెలుస్తాయి కదా అని నిలదీస్తున్నారు. దక్షిణ భారతదేశంలో మేనరికపు వివాహాలు సంప్రదాయంలో భాగమని, స్థానిక సంస్కృతులను కథల్లో చూపించడం సహజమని స్పష్టం చేస్తున్నారు. ప్రతిదాన్ని విమర్శించడం సరికాదని కొందరు కౌంటర్ ఇస్తుంటే, మహిళా పాత్రల ప్రాధాన్యతపై నటీమణులు తమ అభిప్రాయాలు చెప్పడంలో తప్పులేదని మరికొందరు సపోర్ట్ చేస్తున్నారు.



నాగార్జున 100వ సినిమాలో టబు స్పెషల్ రోల్

హైదరాబాద్, నవంబర్ 3 (సమయం న్యూస్) : కింగ్ నాగార్జున, అందాల నటి టబు కాంబినేషన్‌కు తెలుగు సినీ పరిశ్రమలో అత్యంత ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. వీరిద్దరూ కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడతా' చిత్రం అప్పట్లో పరిశ్రమ రికార్డులను తిరగరాయడమే కాకుండా, ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసింది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీకి టాలీవుడ్‌లో తిరుగులేని ఆదరణ లభించింది. చాలా కాలం తర్వాత ఈ క్రేజీ ఐకానిక్ జోడీ మరోసారి వెండితెరపై కలిసి కనిపిస్తుండటంతో సినీ అభిమానుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. నాగార్జున నటిస్తున్న ప్రతిష్ఠాత్మక 100వ మైలురాయి చిత్రం 'కింగ్ 100' లో టబు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా ద్వారా ప్రేక్షకులు మరోసారి ఈ అరుదైన జోడీని తెరపై చూడబోతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొనగా, తాజాగా చిత్ర బృందం టబు పాత్రకు సంబంధించిన ప్రత్యేక అప్‌డేట్‌ను అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాలో టబు పాత్రకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను నవంబర్ 4న ఉదయం 9 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ ప్రకటనతో అక్కినేని అభిమానుల్లో మరింత ఉత్సాహం నిండింది. ఆర్. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు స్వరాలు సమకూరుస్తున్నారు. నాగార్జున కెరీర్‌లో ఇది 100వ మైలురాయి చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌కు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ చిత్రాన్ని 2026 డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దశాబ్దాల తర్వాత నాగార్జున, టబు జోడీ మళ్లీ కలవడం, అది కూడా 100వ సినిమా కావడంతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**